నవతెలంగాణ
ఆదిలాబాద్
1
గురువారం | సెప్టెంబర్ 05, 2024 | www.navatelangana.com

ఏఓకు ఆత్మీయ వీడ్కోలు

నవతెలంగాణ-సారంగాపూర్

మండల వ్యవసాయ అధికారిగా రాజశేఖర్‌రెడ్డి సుమారు 12సంవత్సరాలు పనిచేసే ఇటీవల బదిలీపై వెళ్లారు. బుధవారం ఆలూరు పిఏసిఎస్ ఆధ్వర్యంలో ఆత్మీయ వీడ్కోలు పలికారు. చైర్మన్ మాణిక్‌రెడ్డి ఏఓను శాలువాతో సత్కరించి మోమెంటో అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ రైతులకు వెన్నంటి ఉండి సమస్య ఏదైన పరిష్కారానికి కృషి చేశారని తెలిపారు. సేవలను మండల వాసులు మరువ లేరని అన్నారు. నూతనంగా వచ్చిన ఏఓ వికార్ అహ్మద్‌ను సన్మానించి రైతులకు అందుబాటులో ఉండి పని చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ సిఈఓ మల్లేష్, డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



జైనూర్‌లో ఉద్రిక్తత

- వాహనాలు, ఇల్లు దగ్ధం
- మండలంలో 144 సెక్షన్

నవతెలంగాణ-ఆదిలాబాద్

ఆసిఫాబాద్ జిల్లాలోని జైనూర్ మండల పరిధిలో రాఖీ పౌర్ణమి రోజు ఆదివాసీ మహిళపై ఓ గ్రూపుకు చెందిన యువకుడు లైంగిక దాడి చేసి హత్య చేసే ప్రయత్నం చేయగా సంఘటన నిరసిస్తూ ఆదివాసీ సంఘాలు బుధవారం ఇచ్చిన జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్ మండలాల బంద్ పిలుపు ఉద్రిక్తంగా మారింది. ఆదివాసీ నాయకులు నిందితుడు ఇంటిపై దాడి చేసి ఇంటిని తగలబెట్టారు. ఎస్పీ డీవీ.శ్రీనివాసరావు, ఆసిఫాబాద్ డీఎస్పీ సదయ్య, జైనూరు సీఐ రమేష్ పరిస్థితి చేయి దాటకుండా ప్రయత్నాలు చేస్తున్నారు. జైనూరు మండల కేంద్రంలోని పలు దుకాణాలతో పాటు మార్కెట్ ప్రాంతంలోని దుకాణాలను, వాహనాలను ధ్వంసం చేశారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు 144 సెక్షన్ విధించారు. ఎక్కడికక్కడ ఇరు గ్రూపుల నాయకులను అదుపులోకి తీసుకుంటున్నారు.

వరదొచ్చింది..కన్నీరు మిగిల్చింది..!

- పెన్‌గంగ పరివాహక ప్రాంతంలో నీట మునిగిన పంటలు
- జైనథ్, బేల మండలాల్లో సుమారు వెయ్యి ఎకరాల్లో నష్టం
- వాగుల ఉధృతితో మిగతా ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి
- పంట వరదపాలు కావడంతో నిర్వేదంలో అన్నదాతలు
- నేటి నుంచి సర్వే ప్రారంభించనున్న అధికారులు

జిల్లాలో కురిసిన భారీ వర్షాలకు పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ముఖ్యంగా తెలంగాణ- మహారాష్ట్ర సరిహద్దులో ప్రవహిస్తున్న పెన్‌గంగా నది ఉగ్రరూపం దాల్చింది. స్థానికంగా కురిసిన వర్షాలతో పాటు ఎగువన పొరుగు రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలకు వరద నీరు మరింత పోటెత్తింది. దీంతో ఈ ఇరు రాష్ట్రాల సరిహద్దులోని బ్రిడ్జికి అంచుల వరకు ప్రవహించింది. ఈ కారణంగా నది సమీపంలో ఉన్న గ్రామాలను సైతం చుట్టుముట్టడంతో పంట చేలన్నీ నీటితో నిండిపోయాయి. జైనథ్, బేల మండలాల్లోని సుమారు వెయ్యి ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. మరోపక్క ఇతర చోట్ల వాగులు, వంకలు పొంగి పొర్లడంతో వీటి కారణంగానూ పంట నష్టం చోటుచేసుకుంది. గురువారం నుంచి పంట నష్టం తెలుసుకునేందుకు అధికారికంగా సర్వే చేపట్టి ప్రభుత్వానికి నివేదిస్తామని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు.



బేల మండలం సాంగిడి గ్రామానికి చెందిన ఈ రైతు పేరు నాగపూరే మిలింద్. నది పరివాహక ప్రాంతంలో ఉన్న చేనులో 5 ఎకరాల పత్తి పంట వేశారు. పంట ఏపుగా పెరుగుతున్న దశలో గంగానదికి వరదలు రావడంతో నీరంతా పంట పొలంలోకి చేరింది. దీంతో నీటిలో మురిగిపోయి పత్తి పంట పనికి రాకుండా పోయింది. ఇలా ఉమ్మడి జిల్లాలో అనేక మంది రైతులకు వర్షాల కారణంగా వివిధ రకాల పంటలకు నష్టం వాటిల్లింది.



నీటిలో మునిగిన పత్తి పంటను చూపిస్తున్న ఈ రైతు పేరు ఊశన్న, జైనథ్ మండలం కరంజికి చెందిన ఈయన పెన్‌గంగ పరివాహక ప్రాంతంలో పది ఎకరాలు కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నారు. ఎకరాకు రూ.30వేలు కౌలు చెల్లించడంతో పాటు పెట్టుబడి కోసం అదనంగా మరో రూ.40వేల వరకు ఖర్చు చేశారు. తాజాగా నది ఉప్పొంగడంతో వరదనీరు పొలాల్లోకి రావడంతో పంటంతా మునిగిపోయింది. ప్రభుత్వమే ఆదుకోవాలని కోరుతున్నారు.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కురిసిన భారీ వర్షాలు జనజీవనాన్ని అతలాకుతలం చేశాయి. వర్షం ముప్పు ఇంకా ఉన్నప్పటికీ ఇప్పటి వరకు జరిగిన నష్టం మాత్రం విషాదాన్ని నింపింది. అనేక ఆశలతో పంటలు వేసిన రైతులకు కన్నీటిని మిగిల్చింది. ముఖ్యంగా పెన్‌గంగా నదికి భారీ వరద రావడం.. ఇతర వాగులు అందులో కలిసి దిశ మార్చుకోవడంతో పరివాహక ప్రాంతంలోని పంట పొలాలన్ని నీట మునిగాయి. వందల ఎకరాల్లో పత్తి, సోయా, కంది తదితర పంటలకు నష్టం వాటిల్లింది. రోజుల తరబడి పంటలు నీళ్లలోనే ఉండిపోవడంతో పంటంతా మురిగిపోయింది. జైనథ్ మండలంలోని కామాయి, డొల్లార, పెండల్‌వాడ, సాంగ్వి, కౌట, ఆనంద్‌పూర్, కరంజీ గ్రామాలతో పాటు బేల మండలం సాంగిడి, బెదోడా, మణియార్‌పూర్, గూడ, కొగ్దూర్ తదితర గ్రామాల్లో సుమారు వెయ్యి ఎకరాల వరకు పంట నష్టం వాటిల్లినట్లు వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. ముఖ్యంగా పొలాల్లో నీటితో పాటు మట్టి కొట్టుకురావడం, ఇసుక మేటలు వేయడంతో పంట పొలాలు అస్తవ్యస్తంగా మారాయి. పంట చేతికొచ్చే సమయంలో వరదార్పణం కావడంతో అన్నదాతల బాధలు వర్ణణాతీతంగా మారాయి. కౌలుకు తీసుకొని..పంట పెట్టుబడి కోసం రూ.వేలు ఖర్చు చేసి పండించిన పంటంతా నీటిపాలు కావడంతో తీవ్ర నిర్వేదానికి గురవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది ఫసల్ బీమా కూడా అమలు చేయకపోవడంతో పంటల బీమా కూడా వర్తించలేని పరిస్థితి ఉందని వాపోతున్నారు.

వాగులతోనూ పంటలకు నష్టం..!

పెన్‌గంగ నదితో పాటు వాగులు ఉప్పొంగి ప్రవహించడంతో వాటి సరిహద్దుల్లో ఉన్న పంట పొలాలకు నష్టం వాటిల్లింది. వరద తాకిడికి కొంత మేర పంట కొట్టుకుపోగా.. మిగిలిన వాటిలో నీళ్లు నిండుకున్నాయి. ముఖ్యంగా ప్రాణహిత సరిహద్దున పంటలు వరద ప్రవాహానికి గురయ్యాయి. సమీప పంటలైన పత్తి, సోయాతో పాటు మిరప వంటి పంటలు సగం వరకు నాశనమయ్యాయి. గోదావరి నది సైతం ఉగ్రరూపం దాల్చినా.. సమీప గ్రామాల్లో పెద్దగా నష్టం వాటిల్లలేదు. వేలాల వద్ద లోతట్టు ప్రాంతం ఉండటంతో కొంత మేర పంటల్లో ఇసుక మేటలు వేయడంతో ఎదుగుదలకు అవరోధంగా మారింది.

ప్రస్తుతం పసల్‌బీమా సౌకర్యం లేకపోవడంతో రైతులకు ఇన్సురెన్సు సౌకర్యం వర్తించలేని పరిస్థితి కనిపిస్తోంది. ఈ విపత్తు సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే తక్షణం ఆదుకొని రైతులకు భరోసా కల్పించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

నేటి నుంచి సర్వే చేపడతాం : శ్రీధర్‌స్వామి, ఇన్‌చార్జి జిల్లా వ్యవసాయ అధికారి, ఆదిలాబాద్

భారీ వర్షాలతో వరదలు రావడంతో పెన్‌గంగా నది పరివాహక ప్రాంతంలో పంటలు నీట మునిగాయి. జైనథ్, బేల మండలాల్లో సుమారు వెయ్యి ఎకరాల వరకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేశాం. ఉన్నతాధికారుల ఆదేశం మేరకు గురువారం నుంచి క్షేత్రస్థాయిలో పంట నష్టం సర్వే చేపట్టి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తాం.



బేల మండలం మాంగ్రూడ్‌లో నీట మునిగిన పత్తి పంట



కౌటాల మండలం వీర్దండిలో దెబ్బతిన్న మిరప పంట

ఎన్నికలకు ముందే బీసీ రిజర్వేషన్ ప్రకటించాలి

కలెక్టరేట్ ఎదుట బీసీ సంఘం ధర్నా



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎన్నికల సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల ముందే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ప్రకటించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కలాల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం సంఘం జాతీయ అధ్యక్షుడి పిలుపు మేరకు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ముందుగా సంఘ కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరి కలెక్టరేట్‌కు చేరుకున్నారు. మేమెంతో మాకు అంత అంటు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ బీసీలకు ఎన్నికల సమయంలో కామారెడ్డి వేదికగా 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారన్నారు. 42 శాతం ప్రకటించిన తరువాతనే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహిస్తామని హామీ ఇచ్చారన్నారు. కానీ ఇప్పటి వరకు దానిపై ఊసే లేదన్నారు. రాష్ట్రంలో సగం కంటే ఎక్కువ జనాభా బీసీలదే ఉందన్నారు. ప్రస్తుతం బీసీలకు 23 శాతం రిజర్వేషన్ ఉందన్నారు. దాన్ని 42 శాతం ప్రకటించిన తరువాతనే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని, లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ శ్యామలదేవికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చిక్కాల దత్తు, గౌరవ అధ్యక్షుడు నర్సాగౌడ్, కోశాధికారి అంజయ్‌కుమార్, ఉపాధ్యక్షుడు అశోక్, నాయకులు రాంకుమార్, విజయ్ కుమార్, మహిళా సంఘం నాయకురాళ్లు పాల్గొన్నారు.

జోగు రామన్న మతిభ్రమించి మాట్లాడుతున్నారు : పాయల్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ అభివృద్ధి కోసం రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబును కలిస్తే మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న ఓర్వలేక విమర్శలు చేస్తున్నారని, మతిభ్రమించి మాట్లాడుతున్నారని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. మంగళవారం జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రి శ్రీధర్ బాబును కలిసి సీసీఐని తెరిపించేందుకు.చర్యలు తీసుకోవాలని ప్రజల సమస్య విన్నవిస్తే జోగు రామన్న రాజకీయాలు అంటగట్టడం శోచనీయమన్నారు. 8 ఏళ్ల కిందట ప్రారంభించిన చనాక కోర్ట ఇప్పటికీ పూర్తి కాలేదని, ఒక ఎకరం భూమి కూడా తడవలేదని, మంత్రిగా, ఎమ్మెల్యేగా అభివృద్ధి చేయకపోగా ఎదుటివారిని విమర్శిస్తున్నారని పేర్కొన్నారు. సిమెంటు పరిశ్రమను కమీషన్ల కోసం ప్రైవేటు వాళ్లకు అప్పగిస్తున్నారని రామన్న ఆరోపించడాన్ని తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్‌కు చెందిన మంత్రిని కలిస్తే రాజకీయ అక్కసు వెళ్లబోసుకుంటున్నారని ధ్వజమెత్తారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా గతంలో ఏ కాంట్రాక్టర్ దగ్గర ఎన్ని కమీషన్లు నొక్కావో తెలుసునని అన్నారు. అవసరం వచ్చినప్పుడు బండారం బయటపెడతానని స్పష్టం చేశారు. గతంలో బిజెపి కేంద్ర మంత్రిని జోగు రామన్న ఎందుకు కలిశాడో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అభివృద్ధి కోసం ఎవరినైనా కలవొచ్చని, మంచి పనులు చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వానికి కూడా సహకరిస్తానని స్పష్టం చేశారు. సమావేశంలో నాయకులు అంకత్ రమేష్, మయూర్ చంద్ర, లాలామున్నా, జోగు రవి, దినేష్ మటోలియా, దయాకర్, ముకుంద్, తోకల నరేష్, మహేష్, వెంకన్న, భీమ్‌సేనరెడ్డి ఉన్నారు.

త్రీఫేస్ విద్యుత్‌కు అనుమతి ఇవ్వాలని ధర్నా



నవతెలంగాణ-బోథ్

మండలంలోని అజ్జర్ వజ్జర్ గ్రామపంచాయతీ పరిధిలోని లెండిగూడ, మహాదుగూడ, కేశవ్‌గూడ, నాగుగూడ ఆదివాసీ గ్రామాలకు త్రీఫేస్ విద్యుత్‌కు అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ సంఘాల నాయకులు బుధవారం అటవీ శాఖ కార్యాలయం ముందు ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం త్రీఫేస్ విద్యుత్ సౌకర్యం కల్పించగా సదరు కాంట్రాక్టర్ పనులను ప్రారంభించారని తెలిపారు. కానీ అటవీ అధికారులు పనులను అడ్డుకున్నారని పేర్కొన్నారు. ఎన్నో సంవత్సరాల నుంచి త్రీఫేస్ సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నామని, ప్రభుత్వం సానుకూలంగా స్పందించినా అటవీ అధికారులు అడ్డు తగులుతున్నారని తెలిపారు. లెండిగూడ గ్రామం వరకు అటవీ శాఖ అనుమతి ఉన్నందున అక్కడి వరకు పనులు చేసుకోవాలని అటవీ అధికారులు చెప్పారు. మిగతా గ్రామాలకు అనుమతి వచ్చేంత వరకు పనులు ఆపేయాలని చెప్పడంతో ధర్నా విరమించారు.

నేడు జిల్లా కాంగ్రెస్ పార్టీ సమావేశం

నవతెలంగాణ-నిర్మల్

జిల్లా కాంగ్రెస్ పార్టీ సమావేశాన్ని గురువారం నిర్వహిస్తున్నట్లు డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని రెడ్డి ఫంక్షన్ హాల్‌లో మధ్యాహ్నం 3 గంటలకు నిర్మల్, ఖానాపూర్, ముధోల్ నియోజకవర్గం సంబంధించి కార్యకర్తల సమావేశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఉమ్మడి జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు హాజరవుతున్నారని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తే కఠిన చర్యలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆసిఫాబాద్ జిల్లా జైనూర్‌లో జరిగిన ఘటనపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ గౌష్ ఆలం బుధవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ప్రజలందరూ సంయమనం పాటించాలని, పోలీసు యంత్రాంగం కేసు నమోదు చేసిందని, దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు. కారకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మవద్దని పేర్కొన్నారు. వదంతులను ప్రచారం చేస్తూ మతాల మధ్య చిచ్చుపెట్టే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సోషల్ మీడియాపై జిల్లా పోలీసు యంత్రాంగం నిఘా ఏర్పాటు చేసిందని, నిజానిజాలు తెలుసుకోకుండా ప్రచారం చేసిన వారిపై, వాట్సాప్ గ్రూప్ అడ్మిన్‌లపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. జైనూర్‌లో 144 సెక్షన్ అమలులో ఉందని, ఇతర ప్రాంతాల వారికి జైనూరులో అనుమతి లేదని, చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

డిగ్రీ ప్రవేశాలకు ఇదే చివరి అవకాశం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలు పొందడానికి ప్రభుత్వం చివరి అవకాశం కల్పించినట్టు ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్సెస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జె.సంగీత బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఎక్కడ దరఖాస్తు చేసుకోని విద్యార్థులు గతంలో సీట్లు పొంది చేరని విద్యార్థులు సెప్టెంబర్ 4 నుండి సెప్టెంబర్ 9వరకు దోస్త్ ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకుని, వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ నెల 11న సీట్లు కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. 12 నుంచి 13 వరకు కళాశాలల్లో రిపోర్టు చేయాలని సూచించారు. ఇతర వివరాలకు కళాశాలలోని దోస్త్ కేంద్రం టెక్నికల్ కో-ఆర్డినేటర్ ఇమ్రాన్ అలీని సంప్రదించాలని సూచించారు. విద్యార్థులు ఈ చివరి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పోషణ మాసోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని సుందరయ్యనగర్‌లో పోషణ అభియాన్ ర్యాలీని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీబ్ల్యుఓ సబిత, అర్బన్ సిడిపిఓ వనజ పాల్గొని మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. అనంతరం అంగన్వాడీ కార్యకర్త రాధ ఆధ్వర్యంలో చిరుధాన్యాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సూపర్వైజర్ ఫర్హా ఏఎన్ఎం తులసి ఉన్నారు.

గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి

ఎస్పీ జానకి షర్మిల

నవతెలంగాణ-భైంసా

గణేష్ ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్పీ జానకి షర్మిల సూచించారు. బుధవారం పట్టణంలోని మున్నూరు కాపు సంఘ భవనంలో శాంతి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. శాంతియుతంగా జరుపుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. నిర్మల్, భైంసా పట్టణంలో గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఎలాంటి అవాంఛనీయ ఘటనలు పునరావృతం కాకుండా పోలీసు, రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి గణేష్ మండపం వద్ద విద్యుత్, జనరేటర్ సౌకర్యం, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పట్టణ ప్రధాన వీధుల గుండా రహదారులకు అవసరమైన మరమ్మత్తులు చేపట్టాలని, పారిశుధ్య కార్యక్రమాలు నిరంతరం నిర్వహించాలని మున్సిపల్ శాఖ అధికారులు చూసుకోవాలని పేర్కొన్నారు. మండపాల వద్ద ఎలాంటి విద్యుత్ లూజ్ వైర్లు, విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. నిమజ్జనం రోజున ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. పట్టణంలో గడ్డెన్న వాగు ప్రాజెక్టు వద్ద సంబంధిత అధికారులతో మాట్లాడి బార్కెట్లు, క్రేన్లు, అంబులెన్స్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్ మాట్లాడుతూ పట్టణంలో వినాయక ఉత్సవాలను ఘనంగా, శాంతియుతంగా జరుపుకునేలా పోలీస్ సిబ్బంది పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. ప్రతి గణేష్ మండపం వద్ద సీసీ కెమెరాలతో పాటు నిరంతరం ఒక వాలంటీర్ ఉండేలా చూసుకోవాలని తెలిపారు. అధిక శబ్దం వచ్చే డీజేలకు అనుమతి లేదని, ఉత్సవ కమిటీ సభ్యులు సహకరించాలని కోరారు. కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించుకునేలా హిందూ, ముస్లిం సోదరులు సహకరించాలని కోరారు. సమావేశంలో ఎస్బి ఇన్‌స్పెక్టర్ అశోక్, పట్టణ ఇన్‌స్పెక్టర్ రాజారెడ్డి, మున్సిపల్ కమిషనర్ రాజేష్‌కుమార్, ఆర్డీవో కోమల్‌రెడ్డి, తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, ఫైర్ ఆఫీసర్ రాజారాం, హిందూ ఉత్సవ కమిటీ సభ్యులు, ముస్లిం మత పెద్దలు, కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



అగ్ని ప్రమాదాలపై న్యాక్ విద్యార్థులకు అవగాహన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

న్యాక్ ఆధ్వర్యంలో ఎలక్ట్రీషియన్ లేబర్ కార్డు ఉన్నవారికి శిక్షణ కొనసాగుతోంది. శిక్షణలో భాగంగా బుధవారం అగ్నిప్రమాదం జరిగినప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో అగ్నిమాపక శాఖ కార్యాలయంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎలక్ట్రీషియన్ శిక్షకులు ద్యావంత్ రమేష్ మాట్లాడుతూ శిక్షణ తీసుకుంటున్న వారికి ప్రతిరోజు రూ.300 15రోజుల పాటు శిక్షణ కాలంలో ఇస్తామన్నారు. భోజనం, స్టేషనరీ, టీ షర్ట్, హెల్మెట్, బ్యాగ్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో డి.జయరాం, స్టేషన్ ఫైర్ ఆఫీసర్, ఫైర్‌మెన్ అన్వేష్, ఎం.కార్తీక్, పి.సాయిప్రసాద్, వై .పృథ్వీరాజ్, డి. శంభోజీ, డ్రైవర్ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
2
గురువారం | సెప్టెంబర్ 05, 2024 | www.navatelangana.com

మేకలు, గొర్రెలకు వ్యాక్సిన్ వేయించాలి

నవతెలంగాణ-నార్నూర్



వర్షాకాలం నేపథ్యంలో రైతులు మేకలు, గొర్రెలకు పీపీఆర్ వ్యాక్సిన్ వేయించాలని గాదిగూడ పశు వైద్య సహాయకుడు ఆనంద్ కిషోర్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలో 150 మేకలకు పీపీఆర్ వ్యాక్సిన్ ఇచ్చారు. మేకల మందను గుర్తించి మందులు పంపిణీ చేశారు. ఈనెల 18 వరకు సాగే వ్యాక్సిన్ కార్యక్రమాన్ని యజమానులు, రైతులు సద్వినియోగం చేసుకోని సహకరించాలని కోరారు. ఆయన వెంట సిబ్బంది వినోద్ ఉన్నారు.

శాంతియుత వాతావరణంలో ఉత్సవాలు జరుపుకోవాలి

నవతెలంగాణ-కడెం



గణేష్ ఉత్సవాలను ప్రజలు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఖానాపూర్ సీఐ సైదారావు, కడెం ఎస్సై కృష్ణసాగర్ రెడ్డి కోరారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో మండల గణేష్ మండప నిర్వాహకులు నాయకులు అధికారులతో కలిసి పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉత్సవ నిర్వాహకులు చూసుకోవాలన్నారు. గణేష్ మండప వివరాలను పోలీసులకు తెలియజేయాలని సూచించారు. గణేష్ నిమజ్జనం రోజు చిన్నపిల్లలను పాల్గొనకుండ చూడాలన్నారు. అప్రమత్త చర్యలతోనే ప్రమాదాలను అరికట్టవచ్చు అన్నారు. కార్యక్రమంలో కడెం తహసీల్దార్ సుజాత రెడ్డి, ఏఈ సుమన్ కుమార్, ఎంపీఓ కవిరాజ్, ఆర్ఐ లక్ష్మణ్ పాల్గొన్నారు.

వడ్తల్‌కు నిలిచిన రాకపోకలు

- వంతెనపై పొంగిపొర్లుతున్న వరద నీరు



నవతెలంగాణ-ముథోల్

ఎడతెరిపిలేని భారీ వర్షాలతో మండలంలోని వడ్తల్ వంతెనపై నుండి వరద నీరు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు బుధవారం తెల్లవారుజాము నుండి నిలిచిపోయాయి. దీంతో గ్రామస్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అత్యవసర పనులపై బయటకు వెళ్లేవారికి ఇబ్బందులు తప్పడం లేదు. అలాగే బోరేగాంలో లెవెల్ వంతెన బ్రిడ్జ్‌పై నుండి వరద నీరు ప్రవహిస్తుంది. దీంతో రాకపోకలకు కొంతసేపు అంతరాయం కలిగింది. ఈవిషయం తెలుసుకున్న తహసీల్దార్ శ్రీకాంత్, ఆర్ఐ నారాయణ పటేల్, ఎస్ఐ సాయికిరణ్ సిబ్బందితో కలిసి వరద ఉధృతిని పరిశీలించారు. పలు వివరాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. వర్షపు నీరు ఉధృతి కొనసాగుతుండడంతో వడ్తల్ వంతెనపై నుండి రాకపోకలు చేయొద్దని ఎస్ఐ సూచించారు. పోలీసులు ఎల్లవేళలా అందుబాటులో ఉంటారని, ఆందోళన పడాల్సిన అవసరం లేదన్నారు.

తొలగించిన ఉపాధ్యాయులను తీసుకోవాలి

- అదనపు కలెక్టర్, డీసీఓకు వినతి
- ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని విన్నపం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పార్ట్ టైం ఉపాధ్యాయులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా తొలగించిన ఉపాధ్యాయులను తిరిగి విధుల్లో తీసుకోవాలని గురుకుల ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. ఈ విషయమై బుధవారం జిల్లా అదనపు కలెక్టర్ శ్యామలదేవి, డీసీఓ లలితకు వేర్వేరుగా కలిసి వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా గురుకుల ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఉపాధ్యాయులను తొలగించడం ద్వారా అనేక మంది జీవనోపాధిని కోల్పోయి కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. కనీసం విద్య సంవత్సరం మొదటిలో అయిన సూచన చేయకుండా విద్య సంవత్సరం మధ్యలో తీసుకున్న ఈ నిర్ణయంతో తమ బ్రతుకులు బజారున పడేసినట్లయిందని అన్నారు. ఈ నిర్ణయం తక్షణం విరమించుకోవాలని, తర్వాత వెంటనే అమలు చేసే ప్రక్రియలో తమకు ప్రథమ స్థానం కల్పించి ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో బోథ్, ఇచ్చోడ, ఆదిలాబాద్ గురుకుల ఉపాధ్యాయులు కామేశ్వరి, కిరణ్, సంతోష్ వర్మ, సంధ్య రామస్వామి, శారద పాల్గొన్నారు.

నిందితున్ని కఠినంగా శిక్షించాలి



నవతెలంగాణ-నార్నూర్

ఆదివాసీ మహిళపై దాడి చేసిన నిందితుని కఠినంగా శిక్షించాలని తుడుం దెబ్బ డివిజన్ అధ్యక్షుడు కనక ప్రభాకర్, జిల్లా ఉపాధ్యక్షుడు మెస్రం మాణిక్ రావ్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని కుమురం భీం విగ్రహం వద్ద ఆదివాసీ నాయకులతో కలిసి మీడియాతో మాట్లాడారు. జైనూర్ మండలంలోని దేవుగుడా గ్రామానికి చెందిన ఆదివాసీ గొండ్ తెగకు చెందిన మహిళపై జరిగిన దాడిని వ్యతిరేకిస్తూ బాధిత మహిళకు న్యాయం చేయాలన్నారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు మడావి సాగర్, ఆడా శ్రీరాం, పెందూర్ దాదిరావ్, పెందూర్ దీపక్, మెస్రం మోతీరాం, సుర్పం నాగోరావ్, పెందూర్ సంతోష్ ఉన్నారు.

ఎల్లిగడ్డ కిలో 400



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

నిత్యావసర వస్తువులు వినియోగదారులకు చుక్కలు చూపిస్తున్నాయి. వారం రోజుల కింద కిలో రూ.200 పలికిన ఎల్లిగడ్డలు ఇప్పుడేమో కిలో రూ.400కు చేరుకుంది. దీంతో సామాన్య మధ్యతరగతి ప్రజలు ఎల్లిగడ్డలు కొనుగోలు చేయాలంటే తల పట్టుకుంటున్నారు. బుధవారం మండలంలోని ముత్నూర్ వారాంతపు సంతలో కిలో ఎల్లిగడ్డ ధర అమాంతంగా పెరిగి రూ.400లు పలకడంతో కొనుగోలుదారులు భిక్కు భిక్కు మంటున్నాడు. నేనేమీ తక్కువ కాదంటూ..దాని సరసన ఉల్లిగడ్డ సైతం కిలో రూ.80కు చేరింది. దీంతో కిలో తీసుకునే వాళ్ళు పావు కిలోతో సరి పెడుతున్నారు. ప్రతి రోజు వంటల్లో ఉల్లి, ఎల్లి లేనిదే కుదరని పని. దీన్ని ధరలు ఆకస్మాత్తుగా చుక్కలు చూపిస్తుండడంతో కొనుగోలుదారులు లబోదిబోమంటున్నారు.

దొడ్డి కొమురయ్యకు సీపీఐ(ఎం) నివాళ్లు

- వార్షికోత్సవాలను ప్రారంభించిన జిల్లా కార్యదర్శి మల్లేష్



దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేస్తున్న సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం వార్షికోత్సవాల్లో భాగంగా ఆ పోరాటంలో తొలి అమరుడు దొడ్డి కొమురయ్యకు సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నివాళ్లు అర్పించి వార్షికోత్సవాలను ప్రారంభించారు. బుధవారం పట్టణంలోని సుందరయ్య భవనంలో ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన చేసిన కృషిని వర్ణించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ మాట్లాడుతూ 1946 నుండి 1951 వరకు తెలంగాణ రైతాంగ పోరాటం జరిగిందన్నారు. ఆ పోరాటం భూమికోసం, భుక్తికోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం జరిగిందని తెలిపారు. విష్ణుర్ రామచంద్రా రెడ్డి గుండాల కాల్పుల్లో 1956 జూలై 4న దొడ్డి కొమురయ్య అమరుడయ్యాడని తెలిపారు. ఆ పోరాటంలో తొలి అమరుడు దొడ్డి కొమురయ్య అని గుర్తుచేశారు. ఆయన మరణం ప్రజలను కదిలించిందని పోరాటం గ్రామ, గ్రామాన విస్తరించిందని, బాంచన్ దొరా అన్నోడికి బందూకు పట్టించిన పోరాటం అని కొనియాడారు. కుల, మతాలకు అతీతంగా నాటి దోపిడీకి వ్యతిరేకంగా హిందూ, ముస్లీం ఇతర మతాల ప్రజలు కలిసి కట్టుగా పోరాడారని తెలిపారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని హిందూ, ముస్లీంల మధ్య పోరాటంగా చిత్రీకరించి రాజకీయ లబ్ది పొందే ప్రయత్నం బీజేపీ చేస్తుందని ఆరోపించారు. వారి భ్రమలో ప్రజలు పడొద్దని పిలుపునిచ్చారు. నేటి నుండి ప్రారంభం అయిన తెలంగాణ రైతాంగ పోరాట వార్షికోత్సవాలు సెప్టెంబర్ 17 వరకు కొనసాగుతాయని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు బండి దత్తాత్రి, నాయకులు లింగాల చిన్నన్న, సీఐటీయూ నాయకులు అగ్గిమల్ల స్వామి, పండుగ పొచ్చన్న, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎన్.స్వామి, మహిళా నాయకులు ఆర్.మంజుల, సుజాత పాల్గొన్నారు.

కుల వృత్తులకు కేంద్ర ప్రభుత్వం చేయూత

- ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్



శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లను అందిస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

నవతెలంగాణ-భైంసా

కుల వృత్తుల వారికి కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తూ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతుందని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. బుధవారం ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో ఖాది ఇండియా పథకం కింద 33 మంది లబ్ధిదారులకు ఎలక్ట్రికల్ పాటర్ వీల్ మట్టి పరికరాలు తయారు చేసే యంత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి ఆధునిక కాలానికి అనుగుణంగా కుల వృత్తుల వారు మారాలన్నారు. కుమ్మరి కులస్తుల సంక్షేమానికి తన వంతుగా పాటుపడతానని తెలియజేశారు. మట్టి పాత్రలను కాల్చే యంత్రాలతో పాటు, విశ్వకర్మ పథకం కింద రుణాలను ఇప్పిస్తానన్నారు. ఈ సందర్భంగా ఎలక్ట్రికల్ పాటర్ వీల్‌తో వాటర్ బాటిల్, పూల కుండి, ఇతర ఆధునిక కాలానికి అనుగుణంగా పాత్రలు తయారుచేసి ఎమ్మెల్యేకు చూపించారు. అనంతరం ఖాది ఇండియా ద్వారా ట్రైనింగ్ పొందిన వారికి సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో కుమ్మరి జాగృతి సొసైటీ నియోజకవర్గ అధ్యక్షులు లింగన్న, మాజీ ఎంపీపీ అబ్దుల్ రజాక్, మాజీ జడ్పీటీసీలు సొలంకి భీమ్‌రావ్, సావ్లీ రమేష్, బీజేపీ సభ్యత్వ నమోదు జిల్లా కో ఆర్డినేటర్ సిరం సుష్మ రెడ్డి, నాయకులు చంద్రకాంత్ పటేల్, కుమ్మరి జాగృతి సొసైటి నాయకులు పాల్గొన్నారు.

రైతులకు పరిహారం అందే విధంగా కృషి

- ఎమ్మెల్యే పాయల్ శంకర్



పంటలను పరిశీలించి వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే పాయల శంకర్

నవతెలంగాణ-బేల

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన పంటలకు సర్వే నిర్వహించి రైతులకు పరిహారం అందే విధంగా కృషి చేస్తానని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. పెన్ గంగ నది బ్యాక్ వాటర్ వల్ల బేల మండలంలోని మాంగ్రూడ్, ఖోగ్దూర్, దేవుజీ గూడా గ్రామాలలో నీట మునిగిన పంట పొలాలను బుధవారం ఎమ్మెల్యే పాయల్ శంకర్ పరిశీలించారు. పంటల పరిస్థితి గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో ఫసల్ బీమా అమలు చేస్తే రైతుల కష్టాలు ఉండేవి కావన్నారు. రైతుల సంక్షేమం కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన ఫసల్ బీమా పథకం అమలు చేయాలని అసెంబ్లీ సమావేశాలలో మాట్లాడడం జరిగిందని గుర్తు చేశారు. నష్టపోయిన రైతులకు సరిపడా పరిహారం ఇవ్వాలని మంత్రి శ్రీధర్ బాబుని కోరడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు దయాకర్, మయూర్ చంద్ర, ముకుందరావు, మండల అధ్యక్షుడు దత్తా నిక్కం, బీజేవైఎం అధ్యక్షుడు నవీన్ పాత్ రాజ్, మాజీ సర్పంచులు ఇంద్ర శేఖర్, రాకేష్, మండల జనరల్ సెక్రెటరీ సందీప్ ఠాక్రే, నారాయణ్, మోరేశ్వర్, రాము బర్మడే, జీవన్, ప్రమోద్ రెడ్డి, అక్షయ్ పాల్గొన్నారు.

పోషక ఆహార లోపాలు లేకుండా చూడాలి

నవతెలంగాణ-నార్నూర్

చిన్నారుల్లో పోషక ఆహార లోపాలు లేకుండా చూడాలని అంగన్‌వాడీ కేంద్రంలో అందిస్తున్న పౌష్టికాహారాన్ని అందించాలని హెల్త్ సుపర్‌వైజర్ సతవ్వ చిన్నారుల తల్లి దండ్రులకు సూచించారు. వైద్యసిబ్బందితో కలిసి బుధవారం తాడిహత్నూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం-2లో చిన్నారులకు కొలతలు బరువు చూసి సామ్ మామ్ పిల్లలకు గుర్తించారు. పిల్లల ఎదుగుదల కోసం కావాల్సిన పౌష్టికాహార లోపాలను వివరించారు. గర్భిణీ బాలింతలు, చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రంలో అమలవుతున్న కార్యక్రమాలు, పౌష్టిక ఆహారంపై అవగాహన కల్పించారు. పిల్లల ఎదుగుదలకు పౌష్టికాహారం ముఖ్యమని వివరించారు. అదేవిధంగా మండలంలోని మహాగాన్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో హెల్త్ సూపర్‌వైజర్ చౌహన్ చరణ్ దాస్, చిన్నారులకు కొలతలు బరువు చేసి సామ్ మామ్ పిల్లలను గుర్తించారు. ఇందులో వైద్య సిబ్బంది సింధు, అంగన్‌వాడీ టీచర్‌లు జాదవ్ పంచుబాయి, రాథోడ్ చంచేల, ఆశాలు సంగీత, అనిత, శ్రీలత, జాదవ్ జీజా, ఆయా చౌహన్ బేబీ ఉన్నారు.

మాజీ సర్పంచ్‌ను పరామర్శించిన జోగు రామన్న

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్



మండలంలోని లోకారి మాజీ సర్పంచ్ పెందూర్ కల్పన లక్ష్మణ్ నాన్న పెందూర్ బొజ్జు మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి జోగు రామన్న కుటుంబాన్ని బుధవారం పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు. అలాగే సిరికొండ గ్రామంలో మర్సకోల అంబు మృతదేహానికి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ గంద్రత్ రమేష్, మాజీ మార్కెట్ చైర్మన్ కుమ్ర రాజు, కనక రమణ, బుచ్చన్న ఉన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కామర్స్ డిగ్రీ కళాశాలలో ఆర్బీఐని స్థాపించి 90 సంవత్సరాలు పూర్తైన సందర్భాన్ని పురస్కరించుకొని కళాశాలకు విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహిస్తున్నట్లు బ్యాంకు మేనేజర్ ఉత్పల్ కుమార్ ధామ్ తెలిపారు. బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అతిక్ బేగంతో కలిసి పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం క్విజ్ పోటీలకు సంబంధించిన వివరాలను తెలియజేశారు. ఈ క్విజ్ పోటీల్లో విద్యార్థులందరూ పాల్గొనేలా చూస్తామని ఆర్బీఐ 90 వసంతాలు పూర్తి చేసిన సందర్భంలో దాని ప్రాముఖ్యత వివరిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ గణపతి రఘు, సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-నార్నూర్



మండలంలోని ఖంపూర్ గ్రామానికి చెందిన కాత్లే ప్రభాకర్ రోజుల క్రితం మృతి చెందాడు. మృతునికి భార్యతో పాటు నలుగురు కుమార్తెలున్నారు. కుటుంబ పరిస్థితిని చూసి ఏజీఎం పంద్రం శంకర్ బుధవారం కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 10 వేల ఆర్థిక సాయం అందించారు. ఆర్థిక సాయం అందించిన వారిలో ఉట్నూర్ డివిజన్ తుడుందెబ్బ అధ్యక్షులు కనక ప్రభాకర్, నాయకులు గోడం ధర్మారావ్ పటేల్, సలాం కేశవ్ రావ్, జుగ్నక్ మాణికరావ్, పంచాయతీ కార్యదర్శి కొడప కాశీరామ్, తోడసం విజయ్ కుమార్, గ్రామస్తులున్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



నవతెలంగాణ-లోకేశ్వరం

మండలంలోని రాజుర గ్రామంలో పచ్చదనం- స్వచ్ఛదనం కార్యక్రమంలో భాగంగా ఐకేపీ సంఘ భవనంలో బుధవారం గ్రామసభ నిర్వహించారు. అనంతరం గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించి పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీపీఎం విజయలక్ష్మి, అర్జాబాయి, పంచాయతీ కార్యదర్శి మహేష్, ఏపీఎం ఆర్ల మల్లేష్, ఐకేపీ మహిళ అధ్యక్షురాలు సరస్వతి, పోసాని, సాయవ్వ సీఏలు మధురాణి, దివ్య, అన్నపూర్ణ, ఐకేపీ మహిళలు పాల్గొన్నారు.

తాంసి : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి జడ్పీ సీఈఓ జితేందర్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని సావర్గాం, భీంపూర్ మండలంలోని నిపాని గ్రామాల్లో సానిటేషన్‌లో భాగంగా పరిసరాలు, పాఠశాలను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో పరిసరాల పరిశుభ్రత ఎంతో ముఖ్యం, పాఠశాలలో మౌలిక సదుపాయాలకు ప్రభుత్వం ప్రత్యేక నిధులను మంజూరు చేస్తుందన్నారు. సిబ్బంది పాఠశాలలో అవసరమైన పనులను పూర్తి చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో తాంసి, భీంపూర్ మండలాల ఎంపీడీఓలు గోపాలకృష్ణ రెడ్డి, అతుల్ కుమార్, ఏపీఓ సంగీత, ఈసీ నరేందర్, టీఏ అనసూయ ఉన్నారు.

పంటను ముంచిన వాన

నవతెలంగాణ-ఉట్నూర్

నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షం పంటను ముంచిదని రైతు దవులే బాలాజీ అన్నారు. మండలంలోని శ్యామ్‌పూర్ గ్రామ రైతు దావులే బాలాజీ ఐదు ఎకరాల్లో పంటనష్టం జరిగింది. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. మండలంలో జరిగిన పంట నష్టాన్ని అధికారులు సర్వే నిర్వహించి పరిహారం ఇప్పించాలని కోరుతున్నారు.

దుబ్బగూడ యువకుల శ్రమదానం



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలోని దుబ్బగూడకు వెళ్లే రహదారి పూర్తిగా ధ్వంసమవ్వడంతో యువకులు శ్రమదానం చేసి బాగు చేసుకున్నారు. ప్రధాన రహదారి నుండి దుబ్బగూడ గ్రామం కిలో మీటరున్నర దూరంలో ఉంది. ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల లో లెవెల్ కల్వర్టు పూర్తిగా మట్టితో మూసుకుపోయింది. దీంతో మట్టి రోడ్డుపై మరింత గుంతలు ఏర్పడటంతో యూత్ సభ్యులు చంద్రకాంత్, యాదవ్ రావ్, జంగు, ఆడ శేఖర్‌తో పాటు మరో పదిమంది యువకులు శ్రమదానం చేసి మూసుకుపోయిన కల్వర్టును పునరుద్ధరించారు. వీరిని పలువురు అభినందించారు.

విద్యార్థులకు ఒరియెంటేషన్ కార్యక్రమం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టం ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో తెలంగాణ అకాడమీ స్కిల్స్, నాలెడ్జ్ (టీఏఎస్‌కే) ఆధ్వర్యంలో విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్ రీజినల్ హెడ్ సాయి కుమార్ పాల్గొని టాస్క్ ద్వారా అందించే వివిధ కార్యక్రమాల గురించి అవగాహన కల్పించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అతిక్ బేగం మాట్లాడుతూ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. టాస్క్‌లో ప్రతి విద్యార్థి తన పేరు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో టాస్క్ మెంటర్ శ్రీ చైతన్యకృష్ణ, బోధన సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

శబరి మాత అఖండ జ్యోతిలో పాల్గొన్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-తలమడుగు



మండలంలోని అర్లి(కే) గ్రామంలో నెలరోజుల నుండి శబరిమాత అఖండ జ్యోతి కార్యక్రమాన్ని గ్రామస్తులు భక్తి శ్రద్ధల నడుమ నిర్వహించారు. బుధవారం చివరి రోజు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నెల రోజుల నుండి గ్రామస్తులు సన్మార్గంలో నడిచి అందరికీ ఆదర్శంగా నిలిచారన్నారు. రోజుకు వందలాది మంది శబరిమాత భక్తులు వచ్చిన వారికి అన్ని సౌకర్యాలు కల్పించడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. భజన భక్తితో పాటు నెల రోజులుగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయన్నారు. సన్మార్గంలో నడిచిన వారే అన్ని రంగాల్లో రాణిస్తారన్నారు. అనంతరం పల్లకి ఊరేగింపులో పాల్గొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తోట వెంకటేష్, కేదారేశ్వర రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, శాల దేవన్న, గజానన్, నిమ్మల సుదర్శన్ రెడ్డి, గోక ప్రకాష్ రెడ్డి, అబ్దుల్లా, ప్రకాష్, పల్లవి, అశోక్ రెడ్డి, సత్యనారాయణ, బోర్ల ప్రశాంత్, రమేష్, బర్కం మల్లేష్, వివిధ గ్రామాల నుండి వచ్చిన మహిళలు పాల్గొన్నారు.

3

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

కుమురంభీం ఆసిఫాబాద్

గురువారం | సెప్టెంబర్ 05, 2024 | www.navatelangana.com

పోచయ్య సేవలు మర్చిపోలేనివి

నవతెలంగాణ-దహెగాం



ఉపాధ్యాయుడిగా పోచయ్య విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అందించిన సేవలు మర్చిపోలేనివని టీయూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శాంతికుమార్, సదాశివ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో కొంచవెల్లి ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తూ ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన కొండగొర్ల పోచయ్యను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుడిగా అనేక ప్రాంతాల్లో పనిచేసి విద్యార్థులను తీర్చిదిద్దారన్నారు. ఉద్యోగ విరమణ అనేది ప్రతి ఉద్యోగికి తప్పదని, ఉద్యోగ జీవితం అనంతరం ప్రశాంత జీవితం కొనసాగించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంఈఓలు బిక్షపతి, వెంకటేశ్వర స్వామి, అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్ఐలకు సన్మానం

నవతెలంగాణ-కాగజ్‌నగర్



కాగజ్‌నగర్ టౌన్ ఎస్ఐలుగా ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన దీకొండ రమేష్, సుధాకర్‌లను బుధవారం రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. పట్టణంలో శాంతిభద్రతల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఈ సందర్భంగా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎం.జయదేవ అబ్రహం, శివప్రసాద్ అన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వైఎస్ఆర్ మూర్తి, బి.నర్సయ్య, షేక్ మహబూబ్, కె.నర్సయ్య, అన్వర్ అహ్మద్, ఎం.సుభాష్, కె.పురుషోత్తం కుమార్, సీతారాం, యు.నారాయణ పాల్గొన్నారు.

వేతనం రాక..వెతలు తీరక..!

- ఎనిమిది నెలల నుంచి దరిచేరని జీతం
- ఆర్థిక ఇబ్బందులు పడుతున్న మల్టీపర్పస్ వర్కర్లు
- సిర్పూర్(టి) పంచాయతీ కార్మికుల దీనావస్థలు

ఒక నెల సమయానికి జీతం రాకపోతేనే ఇబ్బందులు పడే ఈ రోజుల్లో.. ఒకటి కాదు..రెండు కాదు..ఏకంగా ఎనిమిది నెలల నుంచి వీరికి జీతం రావడం లేదు. అధికారులు, ప్రజాప్రతినిధులకు చెప్పినా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఫలితంగా కుటుంబ పోషణ కోసం అప్పులు చేస్తూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ జీవనం సాగిస్తున్నారు సిర్పూర్(టి) పంచాయతీ మల్టిపర్పస్ కార్మికులు. పంచాయతీని నిత్యం పరిశుభ్రంగా ఉంచుతూ ఇతరుల మేలు కోరుతున్న ఈ కార్మికులకు మాత్రం మేలు జరగడం లేదు. ఏకంగా ఎనిమిది నెలల నుంచి గౌరవ వేతనం రాకపోవడంతో కుటుంబ పోషణకు అష్టకష్టాలు పడుతున్నారు. వారి బాధలను ఎవరూ పట్టించుకోకపోవడంతో గత్యంతరం లేని పరిస్థితిలో విధులు బహిష్కరించి నిరసన తెలిపారు.

నవతెలంగాణ- సిర్పూర్(టి)

కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి) మేజర్ గ్రామపంచాయతీ సుమారు 30 మంది మల్టీపర్పస్ వర్కర్స్ పనిచేస్తున్నారు. నిత్యం ఉదయాన్నే విధుల్లో నిమగ్నమై పంచాయతీలో పారిశుధ్యం పనులు చేపడుతున్నారు. వర్షాకాలంలో మండల కేంద్రాన్ని పరిశుభ్రంగా ఉంచుతూ ప్రజలను రోగాల నుంచి బారి నుంచి కాపాడుతున్నారు. వీరికి ప్రభుత్వం నుంచే నిధులతో పాటు పంచాయతీ నుంచి ప్రతి నెల వేతనం చెల్లించాల్సి ఉంటుంది. కానీ ఏకంగా ఎనిమిది నెలల నుంచి జీతం వారి దరికి చేరడం లేదు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి ఫలితం కనిపించడం లేదని వాపోతున్నారు. ఎవరూ స్పందించకపోవడంతో విధులు బహిష్కరించి నిరసనకు దిగారు.

కాలయాపన చేస్తున్నారు..!

జీతం విషయం అధికారులను అడిగితే రేపుమాపు అంటూ జాప్యం చేస్తున్నారని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ప్రతి నెల కాలయాపన జరుగుతోందని చెబుతున్నారు. గత కొన్ని రోజుల క్రితం వేతనాలకు సంబంధించిన చెక్కును తప్పుగా కొట్టడంతో నిలిచిపోయాయని అధికారులు చేసిన తప్పునకు తాము శిక్ష అనుభవించాల్సి వస్తోందని వాపోయారు. ఈ సందర్భంగా జిల్లా పంచాయతీ అధికారి ఎంపీడీఓ కార్యాలయానికి రాగా ఆయనకు సమస్యను వివరించారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే వేతనాలు ఇప్పించేలా కృషిచేస్తామని ఆయన భరోసా ఇచ్చారు. వేతనాలు వచ్చే వరకు విధులకు హాజరుకాబోమని కార్మికులు స్పష్టం చేస్తున్నారు.



మురుగు కాలువల నుంచి చెత్తను తీస్తున్న కార్మికులు



పైప్‌లైన్ పనులకు మరమ్మత్తులు చేస్తున్న కార్మికులు



గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు

ప్రభుత్వం స్పందించి కార్మికులకు వేతనాలు చెల్లించాలి

వెలిచాల కృష్ణమాచారి, సీఐటీయూ జిల్లా నాయకులు



రాష్ట్ర ప్రభుత్వం తమ ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చిన విధంగా గ్రామ పంచాయితీ కార్మికులందరి పర్మినెంట్ చేయాలి. కనీస వేతనాలు అమలు చేస్తామని ప్రకటించింది. ప్రభుత్వం ప్రకటించిన హామీలు అమలు చేయాలి. మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు చేసి కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి. సమస్యలకు పరిష్కారానికి మార్గం చూపాలని లేని పక్షంలో సీఐటీయూ కార్మికుల తరఫున ఉద్యమిస్తుంది.

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

సిర్పూరు నియోజకవర్గంలోని భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని కోరుతూ బుధవారం కాగజ్‌నగర్‌లో ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబుకు తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ సభ్యులు వెలిశాల కృష్ణమాచారి మాట్లాడుతూ యూనియన్ భవన నిర్మాణానికి కృషి చేయాలని, మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సిర్పూరు మండల అధ్యక్షులు సిహెచ్ సత్తయ్య, ఉపాధ్యక్షులు ప్రభాకర్, కార్యదర్శి ఎస్ రమేష్ పాల్గొన్నారు.

నాణ్యమైన, మెరుగైన విద్యుత్ సరఫరా

నవతెలంగాణ-ఆసిఫాబాద్

అత్యుత్తమ సాంకేతికతతో వినియోగదారులకు నాణ్యమైన, మెరుగైన విద్యుత్ సరఫరా అందించడం జరుగుతుందని కుమురంభీమ్-ఆసిఫాబాద్ సర్కిల్ ఎస్ఈ వి.వాసుదేవ్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సరఫరాలో అధునాతన సాంకేతిక పద్ధతులు అవలంబిస్తున్నామని, ఇందులో భాగంగా సైది, సైఫీ అనే అంతరాయాలకు కొలమానంగా తీర్చిద్దిదడం జరిగిందని తెలిపారు. సగటు వినియోగదారునికి కలిగే అంతరాయంపై రియల్ టైం డాటాను క్రోడీకరించి వాస్తవ గణాంకాల ఆధారంగా విశదీకరించి సత్వర చర్యలు తీసుకొని విద్యుత్ అంతరాయాలు కనిష్ట స్థాయికి తీసుకురావడం జరిగిందన్నారు. కార్యచరణ అమలు, నిర్వహణ పూర్తి వివరాలను యాప్‌లో పొందుపరిచి తద్వారా చర్యలు చేపట్టడంతో కాలానుగుణంగా అంతరాయాల సమయం తగ్గుముఖం పట్టిందని, వినియోగదారుల పనులు ఆలస్యం కాకుండా సకాలంలో పూర్తి అవడానికి ప్రవేశపెట్టిన ఈ-స్టోర్ విదానం ద్వారా ప్రక్రియ మొత్తం ఆన్‌లైన్‌లో జరుగుతుందని వివరించారు. దీనితో క్షేత్ర స్థాయి సిబ్బంది సమయం ఆదా అవుతుందని, త్వరితగతిన పనులు పూర్తి అవుతున్నాయని తెలిపారు.

ఎంఈఓ సోమయ్య సేవలు అభినందనీయం



నవతెలంగాణ-కౌటాల

ఎంఈఓ సేవలు అభినందనీయమని డీసీఎంఎస్ వైస్ చైర్మెన్ కొముర మాంతయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇరవై సంవత్సరాలు కౌటాల, చింతలమానెపల్లి మండలాల విద్యాధికారిగా విధులు నిర్వహించిన ఆయన బదిలీపై వెళ్లడంతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను సత్కరించి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు గావుడే హనుమంతు, నారాయణ సింగ్, నానాజీ అరుణ్ కుమార్, జైరాజ్, ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యాలు పాల్గొన్నారు.

ఇండ్లలోకి చేరిన వరదనీరు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మండలంలోని బురుగుడ గ్రామంలోని బీసీ కాలనిలో డ్రైనేజీలో చెత్త పేరుకపోవడంతో బుధవారం ఉదయం భారీ వర్షం కురవడంతో కాలనీలోని పలువురి ఇడ్లలోకి వర్షంనీరు చేరింది. దీంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పంచాయితీ కార్యదర్శికి సమాచారం ఇచ్చిన స్పందించకపోవడంతో కలెక్టరేట్ కంట్రోల్ నెంబర్‌కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వడంతో వెంటనే పంచాయితీ కార్మికులు వచ్చి డ్రైనేజీలో ఉన్న చెత్తను తొలగించారు. నీరు కొంతమేరకు వెళ్లిపోయాయి. ప్రతి సంవత్సరం వర్షం కురిసినప్పుడు కాలనిలోకి వర్షం నీరు చేరుతుందని, వెంటనే అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని వేడుకుంటున్నారు. అలాగే గాజులవాడకు వెళ్ళే దారిలో కూడా నీరు రోడ్డుపై నిలిచిపోవడంతో పాఠశాలకు వెళ్ళే విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తమ కష్టాలు తీర్చాలని కాలనీవాసులు కోరుతున్నారు.

వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి

నవతెలంగాణ-కౌటాల

వైద్యులతో పాటు సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. సాధారణ డెలివరీ కేసులు నమోదు అయ్యేలా చూడాలని వైద్యులకు సూచించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు అవగాహన కార్యక్రమాలతో వైద్య శిబిరాలను నిర్వహించాలని ఆదేశించారు. ఆయన వెంట వైద్యులు సుంకన్న, తప్సియ బేగం ఉన్నారు.



ఆదివాసులు సంయమనం పాటించాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లాలోని జైనూర్ మండల పరిధిలో ఆదివాసీ మహిళపై జరిగిన భౌతిక దాడి నేపథ్యంలో ఆదివాసులు, ఆదివాసీ యువత సంయమనం పాటించాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. బాధితురాలికి మెరుగైన వైద్య సేవలు అందించడం జరుగుతుందని, ప్రభుత్వం తరఫున సాయం అందించి తగు న్యాయం జరిగే విధంగా కృషి చేస్తామని తెలిపారు. నిందితుడిపై కఠిన శిక్షలు తీసుకునేందుకు ప్రభుత్వానికి నివేదిస్తామని, ఆదివాసీ నాయకులు, ప్రజలు, యువత సంయమనం పాటించాలని కోరారు.

జైనూర్ ఘటనపై మంత్రి సీతక్క వివరణ

జైనూర్ మండలానికి చెందిన ఆదివాసీ మహిళపై జరిగిన భౌతిక దాడి విషయంలో బాధితురాలికి ప్రభుత్వం తరఫున సాయం అందిస్తూ తగు న్యాయం చేస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. బుధవారం హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలిని పరామర్శించి దాడి వివరాలను తెలుసుకొని బాధితురాలు కుటుంబ సభ్యులకు ప్రభుత్వం తరఫున అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ ఆదివాసీ మహిళపై జరిగిన భౌతిక దాడి హేయమైన చర్య అని, నిందితుడు ఎంతటి వారైనా కఠినంగా శిక్షిస్తామని, నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారని తెలిపారు. దాడికి సంబంధించి బాధితురాలికి వైద్య పరీక్షలు నిర్వహించి తదుపరి చర్యలు తీసుకుంటామని, భవిష్యత్తులో ఏజెన్సీ ప్రాంతాలలో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా సహకరించాలని కోరారు.

భారీ వర్షాలకు కొట్టుకుపోయిన డాబా రోడ్డు



రోడ్డును పరిశీలిస్తున్న తహసీల్దార్ రియాజ్ అలీ

నవతెలంగాణ-వాంకిడి

మండలంలో మూడు రోజుల నుండి కురుస్తున్న భారీ వర్షాలకు డాబా గ్రామానికి వెళ్లే రోడ్డు కొట్టుకుపోయింది. బుధవారం తహసీల్దార్ మహమ్మద్ రియాజ్ అలీ రోడ్డును పరిశీలించారు. గ్రామానికి వెళ్లడానికి గ్రామస్తులు ఇబ్బందులు పడాల్సి వస్తుందని, త్వరలోనే మరమ్మత్తుల చేయడం జరుగుతుందని తెలిపారు. భారీ వర్షాల నేపథ్యంలో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్పా మిగతా సమయంలో ఇంటి నుండి బయటకు రావద్దన్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టిన తర్వాతనే బయటకు రావాలని సూచించారు. మండల ప్రజలు భారీ వర్షాల వల్ల ఇండ్లు కూలిపోయిన, వాగులు పొంగిన, ప్రమాదాలు సంభవిస్తే తహసీల్దార్ కార్యాలయంలో కానీ, పోలీసులకు 100కు డయల్ చేయాలని ఆయన కోరారు. మండలంలోని ఎనోలి, పిప్పర్‌గొంది, కన్నర్‌గావ్, తదితర గ్రామాలకు వెళ్లే రహదారులు భారీ వర్షాలకు రోడ్లు దెబ్బతిన్నాయని, రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆయనతో పాటు ఎంపీఓ ఖాజా రియాజొద్దీన్, సిబ్బంది ఉన్నారు.

బ్యూటీషియన్ కోర్సులను సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రభుత్వం మహిళ, సంక్షేమ శాఖ ద్వారా జిల్లా మహిళా సాధికారత కేంద్రం సహకారంతో భేటీ బచావో- భేటి పడావో కార్యక్రమంలో భాగంగా అందిస్తున్న బ్యూటీషియన్ కోర్సులను విద్యార్థినులు, యువతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా సంక్షేమ శాఖ అధికారి భాస్కర్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారాంతో కలిసి జిల్లాలోని కాగజ్‌నగర్‌లోని డిగ్రీ కళాశాల, బెండారలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 45 రోజుల బ్యూటీషియన్ కోర్సు పూర్తి చేసిన 93 మంది డిగ్రీ కళాశాల విద్యార్థినులకు ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థినులు, యువతులు, మహిళలు ప్రభుత్వం అందిస్తున్న టైలరింగ్, బ్యూటీషియన్, స్కిల్ డెవలప్మెంట్ కోర్సుల ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ప్రస్తుతం అధిక డిమాండ్ ఉన్న బ్యూటీషియన్ కోర్సును ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని అదనపు ఆదాయాన్ని పొందాలన్నారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్ళు, సీడీపీఓలు, మహిళా సాధికారత కేంద్రం సిబ్బంది, శిక్షకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



మృతుల కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-దహెగాం

ఇటీవల గిరవెల్లి, ఖర్జీ గ్రామాల్లో మృతి చెందిన కుటుంబాలను బుధవారం సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు పరామర్శించారు. కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. గిరవెల్లి గ్రామానికి చెందిన లాట్కురి పెంటయ్య, ఖర్జీ గ్రామానికి చెందిన రౌతు శంకర్ మృతి చెందడంతో బుధవారం వారి ఇంటికి వెళ్లి మృతుల చిత్రపటాలకు నివాళులర్పించి సానుభూతి వ్యక్తం చేశారు. పరామర్శించిన వారిలో మండల అధ్యక్షులు రాపర్తి ధనుంజయ్, బక్కన్న, సంజీవ్, రాజన్న, మల్లగౌడ్, దామోదర్, శ్రీనివాస్ గౌడ్, సంతోష్ గౌడ్, బాపు, రోషన్, లక్మాజి, శంకర్, సంజీవ్, మహేష్, మల్లేష్, కేదార్, భీమేశ్, మధుకర్, కమలాకర్, తిరుపతి, కృష్ణ, ముత్తయ్య, వెంకన్న ఉన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణానికి ఒక వీడియో ఛానల్ రిపోర్టర్ కృష్ణంరాజుగౌడ్ ఇటీవల కాగజ్‌నగర్ నుండి ఈజ్‌గాం వెళ్లే దారిలో సెల్‌ఫోన్ పోగొట్టుకోవడంతో అతని సెల్‌ఫోన్‌ను ఈజ్‌గాం పోలీసులు ట్రేస్ చేసి పట్టుకొని బుధవారం అప్పగించారు. ఈ సందర్భంగా ఈజ్‌గాం ఎస్ఐ రామన్‌కుమార్ మాట్లాడుతూ సెల్‌ఫోన్ పోయినా, దొంగతనానికి గురైనా వెంటనే సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేస్తే పోయిన సెల్‌ఫోన్‌ను ట్రేస్ చేసే అవకాశముంటుందన్నారు. సెల్‌ఫోన్‌లను ట్రేస్ చేయడంలో ప్రతిభ కనబరుస్తున్న కానిస్టేబుల్ నయీంను ఎస్ఐ అభినందించారు.

రేపు ఉచితంగా మట్టి గణపతి విగ్రహాల పంపిణి

నవతెలంగాణ-రెబ్బెన

గోలేటిలోని బస్ షెల్టర్ వద్ద సింగరేణి పర్యావరణ విభాగం ఆధ్వర్యంలో జీఎం ఎం.శ్రీనివాస్ శుక్రవారం వినాయక చవితిని పురస్కరించుకొని ఉచితంగా మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేయనున్నట్లు అధికార ప్రతినిధి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి గణపతి విగ్రహాలను గోలేటి గ్రామస్తులకు పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. కావున గోలేటి గ్రామస్తులు, ఉద్యోగులు శుక్రవారం సాయంత్రం 4 గంటలకు బస్ షెల్టర్ వద్దకు చేరుకోవాలని కోరారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
గురువారం | సెప్టెంబర్ 05, 2024 | www.navatelangana.com

పట్టణంలో ఒక్కసారిగా భారీ వర్షం

నవతెలంగాణ-మంచిర్యాల

జిల్లాలో గత మూడు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పట్టణ ప్రజలు ఆందోళన చెందారు. మంగళవారం వర్షం రాకపోవడంతో ఇక వర్షం పడదేమో అనుకున్న సమయంలో బుధవారం తెల్లవారు జాము నుంచి భారీ వర్షం కురిసింది. పట్టణములోని రోడ్లన్నీ జలమయమయ్యాయి. బుధవారం ఉదయం 74.4 మీ.మీ వర్షపాతం నమోదైంది. రాళ్లవాగు ఉప్పొంగి ప్రవహించడంతో రంగంపేట, పవర్ హౌజ్ కాలనీలకు వెళ్లే వారికి రోడ్డు సదుపాయం లేకుండా పోయింది. రైల్వే స్టేషన్ సమీపంలో గల కాలువలు నిండడంతో వరద నీరు అంత నిండి పోయి గాంధీ పార్క్ ఎదురుగా ఉన్న రోడ్డుపై వరద నీరు చేరడంతో వాహన దారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రాళ్లవాగు ఉప్పొంగి ప్రవహించడంతో సమీప కాలనీల వాసులను అలెర్ట్ చేశారు. అధికారులు రాళ్లవాగు బ్రిడ్జ్ పై నుంచి పొంగి ప్రవహిస్తున్న వరద ప్రవాహన్నీ మంచిర్యాల ఏసీపీ ఆర్ ప్రకాష్, ఆర్డీఓ రాములు, మంచిర్యాల తహసీల్దార్ సందర్శించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు.

ఎలుగుబంటి దాడిలో వ్యక్తికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ-హాజీపూర్



ఎలుగుబంటి దాడి చేసిన ఘటనలో గుడిపేట్ గ్రామానికి చెందిన జగన్నాదుల నాగరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. తన మేకలు ఇంటికి రాకపోవడంతో ముల్కల్ల ర్యాలీ వాగు సమీంలోని అడవిలోకి బుధవారం ఉదయం 6 గంటలకు వెళ్లాడు. పిల్లలతో ఉన్న ఎలుగు బంటి దాడి చేయడంతో నాగరాజు ముఖంపై తీవ్ర గాయాలయ్యాయి. అపస్మారక స్థితిలో వున్న నాగరాజును గ్రామానికి చెందిన కొందరు రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. నాగరాజు సోదరుడు, కుమారుడు సంఘటన స్థలానికి వెళ్లి హుటాహుటిన మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. ఫారెస్ట్ అధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. వరంగల్ ఆస్పత్రికి వెళ్లి బాదితునికి రూ.20 వేల పరిహారం అందించనున్నట్లు ఫారెస్ట్ అధికారులు తెలిపారు.

కల్వర్టు ఎత్తు పెంచాలి

• శాంతపూర్ కాలనీవాసుల ఆవేదన



నవతెలంగాణ-లక్షెట్టిపేట

కల్వర్టు ఇరుకుగా ఉండడంతో ఏ చిన్న వర్షం పడ్డా నీరు ఇండ్లలోకి వస్తున్నాయని మండలంలోని అంకత్‌పల్లి గ్రామ పంచాయితీ పరిధిలోని శాంతపూర్ కలనివాసులు వాపోయారు. మూడునాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మెయిన్ రోడ్డు నుంచి ఊళ్ళోకి వెళ్లే రోడ్డుకు అడ్డంగా ఉన్న కల్వర్టు ఇరుకుగా ఉండడంతో వరద నీరు రోడ్డుమీద పారి ఇండ్లలోకి వచ్చి చేరుతోందని, ఈ కల్వర్టు ఎత్తుపెంచి వర్షపు నీరు ఇండ్లలోకి రాకుండా చర్యలు తీసుకోవాలని కాలని వాసులు కోరుతున్నారు. అదేవిధంగా శాంతపూర్ బస్ స్టాఫ్ వద్ద ఒక బస్ సెల్టర్ నిర్మాణం చేపట్టి ప్రయాణికులకు, రోజు స్కూల్‌కు వెళ్లే పిల్లలకు సౌకర్యం కల్పించాలన్నారు. ఈ సమస్యలను పరిష్కరించాలని వర్షపు నీటిలో నిలబడి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో లింగంపెల్లి వెంకటేష్, సాతరాజి శ్రీనివాస్, చొప్పదండి మల్లేష్, అవునూరి బాలయ్య, పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాటం

• సీపీఐ మండల కన్వీనర్ మామిడి విజయ్

నవతెలంగాణ-జన్నారం



ప్రజా సమస్యలపై సీపీఐ పోరాటం చేస్తుందని ఆ పార్టీ మండల కన్వీనర్ మామిడి విజయ్ అన్నారు. బుధవారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన యువకులు కటకం కోటేష్, మురిమడుగుల శంకర్, జాడి బుచ్చి రాజంలు సీపీఐలో చేరగా కన్వీనర్ మామిడి విజయ్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం, సీపీఐ పోరాటం చేస్తుందన్నారు. పార్టీని మండలంలో మరింత పటిష్టం చేయడానికి, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలో నిరాశ్రయులైన, నష్టపోయిన వారికి ప్రభుత్వం సర్వే నిర్వహించి వెంటనే వారికి నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

అతి తక్కువ ధరకే విద్యుత్ మీటర్లు

నవతెలంగాణ-వేమనపల్లి

విద్యుత్ మీటర్ లేని వినియోగదారులకు తెలంగాణ ప్రభుత్వం తీపి కబురు అందించిందని, కేవలం రూ.938 చెల్లిస్తే విద్యుత్ మీటర్ అందజేస్తామని విద్యుత్ శాఖ ఏఈ దీక్షిత్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గృహ జ్యోతి పథకంలో భాగంగా ప్రతి కుటుంబానికి 200 యూనిట్ల వరకు జీరో బిల్లు అమలు చేస్తుందన్నారు. అందులో భాగంగా గ్రామాలలో విద్యుత్ మీటర్ లేనివారిని తమ సిబ్బంది గుర్తించి కేవలం రూ.938 చెల్లిస్తే 0.5 కిలో వాట్ లోడ్‌తో కూడిన కరెంటు మీటర్ అందజేస్తామని తెలిపారు. దీనికోసం వినియోదారులు సిబ్బందికి డబ్బులతో పాటుగా సంబంధిత జీరాక్స్ కాపీలు ఇవ్వాలని వారు రసీదు ఇస్తారని అన్నారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-నస్పూర్

2024-25 సంవత్సరానికి గాను జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేటు కళాశాలలో విద్య అభ్యసిస్తున్న అర్హులైన విద్యార్థినీ, విద్యార్థులు పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ అధికారి పోటు రవీందర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థినీ, విద్యార్థులు నూతన, రెన్యువల్ పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాలకు డిసెంబర్ 31వ తేదీలోగా ఆన్‌లైన్‌లో తెలంగాణఈపాస్.సీజీజీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. విద్యార్థుల బ్యాంక్ ఖాతా వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలని, పెండింగ్‌లో ఉన్న 2022-23, 2023-24 విద్యా సంవత్సరాల పోస్ట్ మెట్రిక్ హార్డ్ కాపీలు జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ కార్యాలయంలో సమర్పించాలని, కళాశాలల యాజమాన్యాలు ఉపకార వేతనాల నమోదు ప్రక్రియ 100 శాతం జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

ఉద్యోగ విరమణ పొందిన అధికారులకు సన్మానం

నవతెలంగాణ-మందమర్రి

సింగరేణి సివిల్ ఆఫీస్ డిప్యూటీ సూపరింటెండెంట్ బండారి రాజేందర్, జేఈ వెంకటేశ్వరరావు ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా సింగరేణి సివిల్ కాంట్రాక్టర్స్ అండ్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. బుధవారం సివిల్ కాంట్రాక్ట్ అసోసియేషన్ కార్యాలయంలో ముఖ్య గౌరవ అధ్యక్షులు పరంధాం కుమార్, గౌరవ అధ్యక్షులు టి.తిరుపతి రెడ్డి, అధ్యక్షుడు బర్ల నాగమల్లేష్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. సన్మాన గ్రహీతలకు పూలమాల, శాలువాలు వేసి సత్కరించారు. కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ ఉద్యోగ విరమణ చేసిన అధికారులతో తమకు ఉన్న అనుభవాలను పంచుకున్నారు. సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ తమను సన్మానించిన సివిల్ కాంట్రాక్టు అసోసియేషన్ సభ్యులకు తోటి ఉద్యోగులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ గుంటి రవీందర్, ప్రధాన కార్యదర్శి బర్ల చంద్రశేఖర్, కోశాధికారి సీహెచ్ శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు, సివిల్ కాంట్రాక్టర్స్, సివిల్ వీవైఎస్ఈ శ్రీధర్, జేఈ దేవకుమార్, సివిల్ సూపర్‌వైజర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అద్దె భవనాలు.. అరకొర వసతులు..!

• సమస్యలతో సతమతమవుతున్న విద్యార్థులు
• సమస్యలపై దృష్టి సారించిన ప్రభుత్వం
• వసతిగృహాలను తనిఖీ చేస్తున్న అధికారులు



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న అదనపు కలెక్టర్(ఫైల్)

నవతెలంగాణ-మంచిర్యాల

జిల్లాలో సంక్షేమ వసతీ గృహాలు అద్దె భవానాల్లో కొనసాగుతూ.. అరకొర వసతులతో విద్యార్థులు సతమతమవుతున్నారు. ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించి సంబంధిత అధికారులు హాస్టల్ బాట పట్టాలని ఇటీవల ఆదేశాలు జారీ చేసింది. దీంతో జిల్లా వ్యాప్తంగా ఉన్న సంక్షేమ హాస్టళ్లపై అధికారులు దృష్టి సారించారు. ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు అధికారులు హాస్టల్ బాట పట్టారు. జిల్లాలో మొత్తం సోషల్ వెల్ఫేర్ 10, మహాత్మ జ్యోతిబా పూలే 8, మైనారిటీ 3, కేజీబీవీ 18, ఆశ్రమ పాఠశాలలు ఉన్నాయి. జిల్లాలో ఉన్న హాస్టళ్లలో నెలకొన్న సమస్యలతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిసింది. గతంలో విద్యార్థుల ఆరోగ్యం క్షీణించి ప్రాణాలు కోల్పోయిన సందర్భాలు ఉన్నాయి. విద్యార్థులకు కలుషిత ఆహారం అందిస్తున్నారనే విమర్శలు వెలువెత్తుతున్నాయి. ఈ నేపథ్యం లో రాష్ట్ర ప్రభుత్వం అధికారులు తప్పని సరిగా సంక్షేమ హాస్టళ్ల , విద్య సంస్థలను సందర్శించి అక్కడి పరిస్థితులను అంచనా వేసి ప్రధాన సమస్యలు ఏవైనా ఉంటె వెంటనే పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేసింది. మంచిర్యాల అదనపు కలెక్టర్ సభావాత్ మోతిలాల్ మంచిర్యాలలోని విద్య సంస్థలు, హాస్టళ్లను వస్తృతంగా తనిఖీ చేస్తున్నారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నారు. సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు తన దృష్టికి వస్తే తగిన సూచనలు చేస్తున్నారు. తీరు మారకుంటే కటిన చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు. విద్య బోధనలో మార్పులు, హాస్టళ్లలో ఏదైనా సమస్యలు ఉంటె వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నారు.

అధికంగా అద్దె భవనాల్లోనే నిర్వాహణ

జిల్లా వ్యాప్తంగా ఉన్న సంక్షేమ హాస్టళ్ల అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. కొన్నింటికి మాత్రమే సొంత భవనాలు ఉండగా మిగిలినవి మాత్రం అద్దె భవనాల్లో అరకొరా వసతులతో నిర్వాహణ కొసాగుతోంది. ఇరుకు గదులు, మంచినీటి సమస్యలు, బాత్ రూమ్స్ సరిపడా లేక పోయడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మరి కొన్ని చోట్లా నాణ్యమైన భోజనం అందడం లేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సదుపాయాలు లేక మరి కొందరు విద్యార్థులు హాస్టళ్లను వదిలి వెళ్తున్న సందర్భాలు ఉన్నాయి. మరి కొన్ని చోట్ల డార్మెటరీ, బెడ్లు సదుపాయాలు లేక పోవడంతో విద్యార్థులు నేల మీద నిద్రపోవల్సిన పరిస్థితులు ఉన్నాయి. ఇటీవల బెల్లంపల్లిలోని జ్యోతి బాపూలే బాలికల హాస్టల్‌ను కలెక్టర్ కుమారు దీపక్ సందర్శించారు. విద్యార్థుల సమస్యలు, భోజన సదుపాయాలు, విద్యార్థులకు బోధనపై ఆరా తీశారు. సొంత భవనం లేక ఇబ్బందులు పడుతున్నట్లు హాస్టల్ సిబ్బంది కలెక్టర్ దృష్టికి తీసుకెల్లారు. గతంలోను బెల్లంపల్లిలోని మహాత్మజ్యోతిబా పూలే బాలికల వసతీ గృహం కోసం సొంత భవనం కేటాయించాలని కోరుతూ ప్రిన్సిపాల్ నియోజకవర్గ ఎమ్మెల్యే, ఎంపీ లకు వినతి పత్రం అందజేశారు. సొంత భవనాలు, నాన్యమైన భోజనం, పిల్లలకు మెరుగైన విద్య అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

తనిఖీలు చేస్తున్నాం

మోతీలాల్, అదనపు కలెక్టర్ మంచిర్యాల



ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా లోని సంక్షేమ హాస్టళ్లు, విద్య సంస్థల్లో నెలకొన్న సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్నాం. విద్య భోజన, సదుపాయాలు గురించి ఆరా తీస్తున్నాం. విద్యార్థులకు నాణ్యమైన భోజనం, మెరుగైన విద్య సదుపాయాలు కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించాలి

• అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్



నవతెలంగాణ-నస్పూర్

జిల్లాలో గణేష్ నవరాత్రి ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో నిర్వహించాలని అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్ సూచించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో డీసీపీ ఎ భాస్కర్ వివిధ శాఖ అధికారులు ఉత్సవ కమిటీ నాయకులతో కలిసి శాంతి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వినాయక చవితి, మిలాద్-ఉన్-నబి పండుగలను మతసామరస్యంతో శాంతియుతంగా నిర్వహించుకోవాలని తెలిపారు. శాంతి కమిటీ సభ్యులు పండుగలను ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో జరుపుకునే విధంగా సమన్వయంతో కృషి చేయాలని అధికారులకు సూచించారు. మండపాల వద్ద నిర్వాహకులు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, మున్సిపల్, పంచాయతీ, సంబంధిత అధికారులు ప్రతి రోజు పారిశుధ్య నిర్వహణ చేపట్టాలని, నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండే విధంగా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. వినాయక మండపాల నిర్వాహకులు మండపాల నిర్వహణకు విద్యుత్, పోలీసు, మున్సిపల్, మండల ప్రజాపరిషత్, సంబంధిత శాఖల అనుమతులు తప్పనిసరిగా పొందాలని తెలిపారు. అగ్నిమాపక శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, వినాయక నిమజ్జనం రోజున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు శాఖ అధికారులు బందోబస్తు ఏర్పాటు చేయాలని తెలిపారు. డీసీపీ మాట్లాడుతూ మంచిర్యాల జిల్లాలో కోల్‌బెల్ట్ ప్రాంతం ఉన్నందున ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారు ఉన్నారని, వినాయక నిమజ్జనం, మిలాద్-ఉన్-నబి పండుగలు జరుగనున్న సందర్భంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టడం జరుగుతుందని, రెవెన్యూ, సంబంధిత శాఖల సమన్వయంతో గ్రామానికి ఒక కానిస్టేబుల్‌ను నియమించడం జరుగుతుందని తెలిపారు. నిమజ్జనం రోజు లక్షెట్టిపేట మండలంలోని రాయపట్నం, మంచిర్యాల పట్టణంలోని గౌతమేశ్వర ఆలయం, సీతారాంపల్లి, ఇందారం, చెన్నూర్‌లోని పెద్ద చెరువు, బెల్లంపల్లిలోని పోచమ్మగుడి ప్రాంతాలలో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు.

ప్రజల ప్రాణాలు కాపాడాలి

• ఉప ముఖ్యమంత్రికి సీపీఐ(ఎం) వినతి

నవతెలంగాణ-నస్పూర్



జిల్లాలో గత రెండు నెలలుగా ప్రజలు డెంగు, టైఫాయిడ్, చికెన్ గున్యా, విష జ్వరాలతో అల్లాడిపోతున్నారని, వాటిని అరికట్టి ప్రజల ప్రాణాలను కాపాడాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు పైళ్ల ఆశయ్య సచివాలయంలో ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్కకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే జిల్లాలో 6 మందికి పైగా మరణించడం జరిగిందని, సీపీఐ(ఎం) నాయకత్వం జిల్లాలో పర్యటనలు చేసి ప్రజల బాధలను, గ్రామాలు, పట్టణాల్లో ఉన్న సమస్యలను, ఆస్పత్రుల్లో ప్రజలకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించామని తెలిపారు. ఈ నెల 1న సీపీఐ(ఎం) మంచిర్యాల జిల్లా కమిటీ సమావేశంలో జిల్లాలో నెలకొన్న ఆరోగ్య సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి జిల్లాలో అన్ని ప్రాంతాలలో హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేసి ప్రజలను కాపాడాలని నిర్ణయించడం జరిగిందన్నారు. ఉప ముఖ్యమంత్రి స్పందించి మంచిర్యాల జిల్లాలో ఉన్న విష జ్వరాలను అరికట్టడం, ప్రజల ప్రాణాలను కాపాడడం కోసం తగు చర్యలు తక్షణమే తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటా

• రాష్ట్ర జీసీసీ చైర్మన్ కొట్నాక్ తిరుపతి



జన్నారం : కురుస్తున్న వర్షాలకు నిరాశ్రయులైన బాధితులకు అండగా నిలుస్తానని రాష్ట్ర జీసీసీ చైర్మన్ కోట్నాక తిరుపతి అన్నారు. బుధవారం మండలంలోని కలమడుగు గ్రామానికి చెందిన నిరుపేదలైన కల్లెడ భీమయ్య ఇళ్ళు వర్షానికి కూలండంతో పరామర్శించి వారి కుటుంబ సభ్యులకు బీమక్క, గంగజలకు తక్షణ సహాయంగా 25 కిలోల బియ్యం నిత్యావసర సరుకులను అందించారు. అనంతరం జన్నారం గ్రామపంచాయతీ పరిధిలోని గోండుగూడా గిరిజన గ్రామాన్ని సందర్శించి అక్కడి గిరిజన జీవన స్థితిగతులపై ఆరా తీశారు. వారికి రోడ్డు విద్యుత్తు మంచినీటి సౌకర్యాలు సక్రమంగా అందే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఊరే సాయికుమార్, మహమ్మద్ ఎజాజొద్దీన్, బొంతల చందు, పేంద్రం రాజేశ్వరరావు, నయన్ పాషా, ప్రసాద్, దాసరి తిరుపతి, సృజన్, మేకల అక్షయ్ కుమార్ పాల్గొన్నారు.

నిరవధిక నిరాహార దీక్షను విరమింపజేయాలి



నవతెలంగాణ-జన్నారం

స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని అమరణ నిరాహార దీక్ష చేపట్టిన వారి దీక్షను విరమింప జేయాలని బీసీ కులాల ఉద్యమ పోరాట సంఘం రాష్ట్ర కోకన్వీనర్లు కే ఏ నరసింహులు, కడార్ల నరసయ్య ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత 11 రోజులుగా హైదరాబాద్ గాంధీ ఆస్పత్రిలో భత్తుల సిద్దేశ్వర్, వరంగల్‌లో చామర్తి కుమార్ గాడ్గే అమరణ నిరాహార దీక్ష చేస్తున్నారని వాళ్ళ ఆరోగ్యం క్షీనించి కోలుకోలేని పరిస్థితులు వచ్చాయని తెలిపారు. రాష్ట్రంలో ఉన్న బీసీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించి స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పించడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చి వారి దీక్షను విరమింప చేయాలని కోరారు. ప్రస్తుతము తెలంగాణ రాష్ట్రంలోని ఇద్దరు బీసి మంత్రులు, 21 మంది బీసీ ఎమ్మెల్యేలు, నలుగురు ఎంపీలు, ఎమ్మెల్సీలు ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి రిజర్వేషన్లు అమలు చేయటానికి ఖచ్చితంగా ప్రయత్నిస్తామని నిరాహారదీక్ష పరులకు హామీని ఇచ్చి దీక్షను విరమింప చేయడానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ కులాల ఉద్యమ పోరాట సంఘం నాయకులు మూల భాస్కర్‌గౌడ్, జిల్లా బీసీ కేయూపీఎస్ కన్వీనర్ ఆడెపు లక్ష్మీనారాయణ, కో కన్వీనర్ బాలసాని శ్రీనివాస్‌గౌడ్, బాదం పెల్లి మాజీ ఎంపీటీసీ కాసెట్టి రాజన్న పాల్గొన్నారు

రాజకీయ జోక్యంతో ప్రమోషన్లు ఆలస్యం

నవతెలంగాణ-నస్పూర్

రాజకీయ జోక్యంతో ప్రమోషన్లు ఆలస్యం అవుతున్నాయని టీబీజీకేఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సింగరేణిలో అంతర్గత అభ్యర్థులను ఎలక్ట్రికల్ చార్జి హాండ్ పోస్టులు భర్తీ చేసేందుకు యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసి అప్లై చేసిన 35 మంది అభ్యర్థులకు ఇంటర్వ్యూలను నిర్వహించి 33 మందిని సెలెక్ట్ చేసిందని తెలిపారు. సెలెక్ట్ అయినా అభ్యర్థులను ప్రమోషన్లు ఇవ్వకుండా కౌన్సిలింగ్ పేరిట, రాజకీయ జోక్యంతో ఆలస్యం చేయడం సమంజసం కాదని తెలిపారు.

వృత్తి శిక్షణ కోర్సులకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-నస్పూర్

సింగరేణిలో వృత్తి శిక్షణ కోర్సులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డీజీఎం పర్సనల్ అరవిందరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీరాంపూర్ ఏరియా సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో 2024-2025 సంవత్సరానికి గాను వృత్తి శిక్షణ కోర్సులకు శిక్షకులుగా ఆసక్తి గల మహిళల (సింగరేణి ఉద్యోగస్తుల డిపెండెంట్స్, భూ నిర్వాసితుల) నుంచి దరఖాస్తులను కోరుతున్నట్లు తెలిపారు. శ్రీరాంపూర్ ఏరియాలో టైలరింగ్, మగ్గం వర్క్స్, బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సుల్లో శిక్షణకు ఆసక్తి గల మహిళలు తమ కోర్సుకు సంబంధించిన సర్టిఫికెట్లు, ఆధార్ కార్డుతో పాటు రెండు ఫోటోలు పూర్తి వివరాలతో తమ బయోడేటాను తీసుకుని పర్సనల్ డిపార్ట్మెంట్‌లో ఈ నెల 11వ తేదీన సాయంత్రం 5 గంటలలోపు అందజేయాలని కోరారు. అలాగే కంప్యూటర్ డీటీపీ నేర్పించడానికి కంప్యూటర్ శిక్షణ సంస్థల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు పేర్కొన్నారు.

ప్రమాదవశాత్తు పశువుల పాక దగ్ధం

నవతెలంగాణ-తాండూర్

మండలంలోని అచలాపూర్ గ్రామంలో బ్రాహ్మణవాడలో బుధవారం రాత్రి రెండు గంటల సమయంలో పశువుల కొట్టంలో షార్ట్‌సర్క్యూటై పశువుల పాక దగ్ధమైంది. పశువుల పాకలోని ఆవు అక్కడికక్కడే మృతి చెందగా మరో ఆవుకు తీవ్ర గాయాలతో బయటపడింది. పాకలో లో అగ్ని ప్రమాదం జరుగుతున్న విషయాన్ని గ్రామస్తులు గమనించి మంటలను ఆర్పి వేసే ప్రయత్నం చేశారు. మంటలు అదుపులోకి రావడంతో ఇండ్లకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. విషయం తెలుసుకున్న తాండూర్ రెవెన్యూఅధికారులు సంఘటన స్థలానికి వెళ్లి కాలిపోయిన పశువుల గొట్టంను పరిశీలించి పంచనామా నిర్వహించి నివేదిక పై అధికారులకు పంపినట్లు తెలిపారు.

రైతులు జాగ్రత్తలు పాటించాలి

నవతెలంగాణ-నస్పూర్

ప్రస్తుతం భారీ వర్షాల నేపథ్యంలో ఉద్యాన పంటలు సాగు చేసే రైతులు జాగ్రత్తలు పాటించాలని జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి కె. అనిత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత వారం రోజుల నుండి ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ఉద్యాన పంటలు దెబ్బతినకుండా రైతులు మెళకువలు పాటించాలని తెలిపారు. పొలంలో నిలిచిన నీటిని తీసివేసినట్లయితే పంటను కాపాడుకోవచ్చని తెలిపారు. దెబ్బతిన్న మొక్కలు, వేరు మూల వ్యవస్థ కారణంగా మొక్కలు కోలుకోవడానికి పోషకాలను క్రమంగా ఎరువులతో భర్తీ చేయాలని వివరించారు.

పోలీసుల సూచనలు పాటించాలి

నవతెలంగాణ-లక్షెట్టిపేట



గణేష్ మండలపాల నిర్వాహకులు పోలీసుల సూచనలు పాటిస్తు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సీఐ అల్లం నరేందర్ కోరారు. బుధవారం పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గణేష్ మండపాల నిర్వాహకులకు పోలీసుల సూచనలను తెలియజేశారు. ట్రాఫిక్ అంతరాయం కలిగే ప్రాంతాల్లో మండపాలు వేయకూడదని, హారతి, లైటింగ్ లాంప్స్, విద్యుత్ ఉపకరణాలు కారణంగా అగ్ని ప్రమాదాలు తలెత్తకుండా జాగ్రత్తపడాలన్నారు. కమిటీ సభ్యులు మండపాల వద్ద ప్రతిరోజు ఇద్దరు అందుబాటులో ఉండాలన్నారు. డీజేలకు అనుమతి లేదని, మండపాల వద్ద అగ్నిప్రమాదల నివారణ కోసం ఫైర్ సేఫ్టీలో భాగంగా ఇసుక బాకెట్లు, డ్రమ్ముల్లో నీళ్ల అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. మండపాలను కట్టెలు, ప్లాస్టిక్, పీవీసీ పైపులతో మాత్రమే వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై పి.సతీష్ ఉన్నారు.

రోడ్డుపై గుంతలు పూడ్చివేత

నవతెలంగాణ-కౌటాల



వర్షాల కారణంగా గుంతలు పడిన రోడ్డుకు అధికారులు మరమ్మత్తులు చేయించారు. ఎంపీడీఓ కోట ప్రసాద్ బుధవారం మండల పరిధిలోని ముత్తంపేట నుండి కౌటాల, పార్డీ క్రాస్ రోడ్‌లో ఏర్పడ్డ గుంతలు, ముత్తంపేట ఊరి మొదట గల బ్రిడ్జీ వద్ద ఏర్పడ్డ గుంతలు పూడ్చి రోడ్డు సౌకర్యవంతంగా చేయించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీఓ తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి రమేష్, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కొండాపూర్, కోనూర్ గ్రామాలకు రాకపోకలు నిలిపివేత

నవతెలంగాణ-కాసిపేట



మండలంలోని కొండాపూర్ నుంచి కోనూర్ గ్రామానికి రాకపోకలకు అధికారులు నిలిపివేశారు. కొండాపూర్, కోనూర్ మధ్య వాగు ఉండడంతో వర్షాల కారణంగా వాగు బ్రిడ్జిపై నుంచి నీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో పరిశీలించిన అధికారులు ముందస్తుగా ఎలాంటి ప్రమాదం జరగకుండా రాకపోకలను నిలిపివేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎంఏ ఆలీం, ఎంపీఓ షేక్ సఫ్దర్ ఆలీ, పంచాయతీ కార్యదర్శులు దీప్తి, రజిత పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మట్టి గణపతుల తయారీ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కామర్స్ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ వన్, టూ ఆధ్వర్యంలో వాలంటీర్లతో మట్టి ప్రతిమలను తయారు చేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ ఆకృతులతో వినాయకులను తయారు చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అతీక్‌బేగం పాల్గొని మాట్లాడుతూ పర్యావరణానికి హాని కలిగించకుండా ఇలాంటి మట్టి వినాయకులని పూజకు వాడాలని కోరారు. పర్యావరణానికి హాని కలగకుండా చూసుకోవాలని వాటిని ప్రజలకు పంపిణీ చేయాలని, వాలంటీర్లకు సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓలు పృథ్వీ, యాకూబ్ అలీ, ఎన్‌సీసీ కేర్ టేకర్ చంద్రకాంత్, సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

పార్ట్ టైం ఉపాధ్యాయులను విధుల్లోకి తీసుకోవాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో కొన్ని సంవత్సరాలుగా పార్ట్ టైం, అవుట్ సోర్సింగ్ సిబ్బందిగా సేవలందిస్తున్న వారిని విధుల్లోకి తీసుకోవాలని పార్ట్ టైం, అవుట్ సోర్సింగ్, అసిస్టెంట్ కేర్ టేకర్ ఐసీటీ సిబ్బంది కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, జిల్లా కాంగ్రెస్ కమిటీ కొక్కిరాల విశ్వప్రసాద్‌కి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా రెగ్యూలర్ వారితో సమానంగా విద్యార్థులకు సేవలందిస్తూ రాత్రి పగలు తేడా లేకుండా కష్టపడుతున్నామన్నారు. విద్యా సంవత్సరం మధ్యలో తమని విధులు నుండి తీసివేయడం బాధాకరమన్నారు. దీంతో తమ జీవితాలు అన్ని రోడ్డు మీద పడ్డాయని వెంటనే మమ్మల్ని కాంట్రాక్ట్ ప్రాతిపదికన విధుల్లోకి తీసుకోవాలని కోరారు. అలాగే వెంటనే 3 నెలల వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది దుర్గం శ్రీనివాస్, క్రిష్ణ, సంపత్, ధర్మేంధర్, సల్మా, సునీల్, విజయ్, నారాయణ పాల్గొన్నారు.

ఆదివాసీ మహిళపై దాడికి నిరసనగా రాస్తారోకో

నవతెలంగాణ-కెరమెరి

జైనూర్ మండలం దేవుగూడకు చెందిన ఆదివాసీ మహిళపై దాడికి నిరసనగా బుధవారం మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై గిరిజన సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు గిరిజన సంఘాల నాయకులు మాట్లాడుతూ సోదరులకు రాఖీ కట్టేందుకు గత నెల 31న సిర్పూర్(యు) మండలంలోని కోహినూర్‌కు వెళ్లడానికి ఆటోల కోసం జైనూర్‌లో ఎదురుచూస్తున్న మహిళకు అదే గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ షేక్ మగ్దూం కోహినూర్‌కు వెళ్తున్నట్టు ఆమెను నమ్మించి ఆటో ఎక్కించాడని పేర్కొన్నారు. షేక్ ముగ్దూం రాఘాపూర్ దాటగానే ఒంటరిగా ఉన్న మహిళతో అసభ్యకరంగా మాట్లాడుతూ లైంగికదాడికి యత్నించాడని ఆరోపించారు. దీంతో ఆమె ఎదురు తిరుగడంతో రాడ్డుతో కొట్టి తీవ్రంగా గాయపర్చాడని తెలిపారు. తీవ్ర గాయాలపాలైన సదరు మహిళల గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ జరిగిన దుర్ఘటన వివారాలు వెల్లడించడంతోనే ఘటన వివరాలు బయటికొచ్చినట్లు తెలిపారు. రోజురోజుకు ఆదివాసీ మహిళలపై లైంగికదాడులు పెరిపోతున్నాయన్నారు. ఆదివాసీ గిరిజనులకు రక్షణ లేకుండా పోతుందని వాపోయారు. ఆదివాసీ చట్టాలను పకడ్బందీగా అమలు చేయక పోవడంతోనే ఇలాంటి అఘాయిత్యాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. మహిళ ముఖంపై ఇనుపరాడుతో బలంగా కొట్టి అత్యా చేసేందుకు ప్రయత్నించిన నిందితున్ని కఠినంగా శిక్షించాలన్నారు. దాడికి నిరసనగా గురువారం కెరమెరి మండల బంద్‌కు పిలుపిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షుడు కోవ విజయ్ కుమార్, ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు భరత్ భూషణ్, మాజీ ఎంపీపీ పెందూర్ మోతీరాం, కుమురం భీం ఉత్సవ కమిటీ మాజీ చైర్మన్ పెందూర్ రాజేశ్వర్, మాజీ సర్పంచ్ కుమురం నానేశ్వర్, మహిళ నాయకురాలు కోవ ఇందిరా, నాయకులు సెడ్మకి తుకారం, సోము, దందు పాల్గొన్నారు.

తీజ్ నిమజ్జన సంబరాలు



నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని మాల్దేది గ్రామంలో బంజారా తీజ్ నిమజ్జన సంబరాలు ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ఆడే వసంత్, బోథ్ బ్లాక్ ప్రెసిడెంట్ ప్రఫుల్‌రెడ్డి, అసెంబ్లీ యువజన అధ్యక్షులు బద్దం పోతారెడ్డి, ఆదిలాబాద్ సీనియర్ నాయకులు రాజురెడ్డి, మండల నాయకులు కపిల్, రమేష్ పాల్గొన్నారు.

లక్ష్యాలను ప్రణాళికాబద్ధంగా పూర్తిచేయాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్



పోషణ మాసం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు



మట్టి గణపతి విగ్రహాల ప్రతిష్టాపనపై ముద్రించిన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

నవతెలంగాణ-నిర్మల్

పోషణ అభియాన్‌కి సంబంధించిన పోషణ మాసం కార్యక్రమంలోని నిర్దేశిత లక్ష్యాలు ప్రణాళికా బద్ధంగా పూర్తిచేయాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పోషణమాసం కార్యక్రమంపై అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సెప్టెంబర్ 1 నుంచి 30 వరకు పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా వారాల వారీగా ప్రణాళికలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో భాగంగా ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో శిశువులు, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు పోషకాహారంపై అవగాహన కల్పించాలని సూచించారు. సంబంధిత అన్ని వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. అంగన్‌వాడీ చిన్నారులకు హెపటైటిస్ నిర్ధారణ పరీక్షలను నిర్వహించాలన్నారు. చిన్నారులు, బాలింతల్లో పోషకాహార లోపాన్ని గుర్తించి సరైన ఆహారం తీసుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో న్యూట్రి గార్డెన్లను ఏర్పాటు చేయాలన్నారు. నిరంతరం ప్రతి కేంద్రాన్ని తనిఖీ చేసి అందిస్తున్న పోషకాహారం, సౌకర్యాలు, తాగునీరు, కోడిగుడ్లు, బియ్యం తదితర వస్తువుల నాణ్యతను పరీక్షించి నివేదికలు రూపొందించాలన్నారు. తల్లిపాలు శిశు శారీరక మానసిక ఎదుగుదలకు ఎంతగానో మేలు చేస్తుందని, తల్లిపాల ఆవశ్యకతపై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. వైద్యారోగ్య శాఖ సహకారంతో రక్తహీనత నిర్ధారణ పరీక్షలు నిర్వహించి, రక్త హీనతపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. అవసరమైన వారికి మందులను అందించాలని ఆదేశించారు. పోషణ మాసం కార్యక్రమంలో మహిళా స్వయం సంఘాలను, తల్లిదండ్రులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలను భాగస్వామ్యం చేయాలని తెలిపారు. అనంతరం పోషణ మాసం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించి అధికారులలో ప్రతిజ్ఞ చేయించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఆర్డీఓ విజయలక్ష్మి, డీఎంహెచ్ఓ రాజేందర్, మిషన్ భగీరథ ఈఈ సందీప్, మెప్మా పీడీ సుభాష్, సీడీపీఓలు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మట్టి వినాయక విగ్రహాలనే ప్రతిష్ఠించాలి

పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయక విగ్రహాలనే ప్రతిష్టించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ పిలుపునిచ్చారు. బుధవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో పర్యావరణహితమైన మట్టి విగ్రహాల వినియోగంపై అవగాహన పెంచేందుకు, కాలుష్య నియంత్రణ మండలి ముద్రించిన పోస్టర్లను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు తోడ్పడాలని, వినాయక చవితిని పురస్కరించుకొని మట్టి వినాయకులనే ప్రతిష్టించాలని కోరారు. మట్టి విగ్రహాల వినియోగాన్ని పెంచేందుకు ప్రజల్లో విస్తృతమైన అవగాహన కల్పించాలని సూచించారు. పట్టణాలు, గ్రామాలలోని ముఖ్యమైన కూడళ్ళు, బస్టాండులు, ఇతర ప్రాంతాలలో హోర్డింగులు, పోస్టర్లు ఏర్పాటు చేసి మట్టి గణేష్ విగ్రహాల ఆవశ్యకతను తెలియజేయాలన్నారు. రసాయన రంగుల ద్వారా కలిగే అనర్థాలను ప్రజలకు వివరించాలన్నారు. కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పర్యావరణహితమైన మట్టి విగ్రహాల పంపిణీ కార్యక్రమం నిర్వహించబడుతుందని తెలిపారు. మట్టి విగ్రహాల తయారీని ప్రోత్సహించడం ద్వారా చేతి వృత్తుల వారికి జీవనోపాధిని కల్పించిన వారమవుతామన్నారు. మట్టి విగ్రహాల వినియోగంపై విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస, క్విజ్ పోటీలను నిర్వహించి ఉత్తమ ప్రదర్శన కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్డీఓ విజయలక్ష్మి, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి శ్రీనివాస్, కాలుష్య నియంత్రణ మండలి ప్రతినిధులు రంజిత్ కుమార్, లక్ష్మణ్ ప్రసాద్, మెప్మా పీడీ సుభాష్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దుండగుడిని కఠినంగా శిక్షించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కుమురం భీం జిల్లా జైనూర్ మండలంలో ఆదివాసీ మహిళపై లైంగికదాడి చేసి హత్యయత్నం చేసిన దుండగుడిని కఠినంగా శిక్షించాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టీఏజీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మహిళల పట్ల ఇలాంటి దారుణానికి పాల్పడే వారిని కఠినంగా శిక్షించాలని పేర్కొన్నారు. ఆదివాసీ మహిళపై దాడి చేసిన దుండగుడిని కఠినంగా శిక్షించాలని, అట్రాసిటీ కేసు నమోదు చేసి ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణ జరపాలని, ఆదివాసీ మహిళలకు రక్షణ కల్పించి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. బాధితురాలికి ప్రభుత్వం పరంగా మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు.

దుండగున్ని వెంటనే ఉరితీయాలి

ఆదివాసీ మహిళపై లైంగికదాడి చేసి హత్యయత్నం చేసిన జైనూర్‌కు చెందిన మాగ్దుమ్‌ను వెంటనే ఉరితీయాలని సీపీఐ(ఎంఎల్)మాస్ లైన్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జగన్ సింగ్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని జిల్లా కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక ఆదివాసీ మహిళపై దాడి చేసిన దుండగుడిపై ఎస్సీఎస్టీ అట్రాసిటీ అత్యాచారం కేసులు నమోదు చేసి వెంటనే ఉరిశిక్ష విధించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు సిడాం సాయికుమార్, ఐఎఫ్టీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఉమ్రే నితిన్, పీవైఎల్ జిల్లా ఉపాధ్యక్షులు మడావి రవి, నాయకులు తాడే మారుతి ఉన్నారు.

బెజ్జూర్ : ఆదివాసీ మహిళపై లైంగికదాడి చేసి హత్యయత్నం చేసిన దుండగున్ని ఉరి తీయాలని ఆదివాసీ సంఘాల నాయకుడు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఆదివాసీ భవనంలో ఆదివాసీ సంఘాల నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూమెస్రం ఆదివాసీ మహిళ తన కుటుంబ సభ్యుల ఇంటికి రాఖీ కట్టడానికి ఆటో ఎక్కి వెళుతున్న సమయంలో ఆటో డ్రైవర్ బలవంతంగా లైంగిక దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. హత్య ప్రయత్నం చేసి చనిపోయిందని నిర్ధారించుకొని అక్కనుండి వెళ్లిపోయడని, అయితే మహిళ కొన ఊపిరితో పోరాడుతూ రోడ్డుపైకి వచ్చిందన్నారు. అక్కడి నుండి స్థానికుల సాయంతో ఉట్నూర్, ఆదిలాబాద్ నుండి హైదరాబాద్‌కు చికిత్సకు తరలించారన్నారు. దుండగుడిపై ఎస్సీఎస్టీ అట్రాసిటీ కింద అత్యాచారం కేసు నమోదు చేసి వెంటనే ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ కోర్ట్‌లో విచారించి ఉరిశిక్ష తీయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పెసా జిల్లా ఉపాధ్యక్షుడు కొడప విశ్వేశ్వర్, గోండువాన పంచాయతీ రాయి సెంటర్ బెజ్జూర్ సర్‌మేడి కొడప శంకర్, కోరేత తిరుపతి, సిడం సక్కారం, పెద్దల శంకర్, కొడప పుల్లయ్య, పోరితేటి ప్రభాకర్, సడ్మేక రమేష్, కొడప సత్యవన్, తొర్రమ్ వినోద్, ఏడ్ల మహేష్, సిడాం అంజి పాల్గొన్నారు.





ఆదివాసీ మహిళకు అండగా ఉంటా

- ఎమ్మెల్యే కోవ లక్ష్మీ
- బాధితురాలికి పరామర్శ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆదివాసీ మహిళపై అఘాయిత్యానికి పాల్పడ్డ నిందితున్ని కఠినంగా శిక్షించాలని బాధితురాలికి అండగా ఉంటామని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలని పరామర్శించారు. ఆదివాసీ మహిళకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. అనంతరం మాట్లాడుతూ ఆదివాసులపై రోజురోజుకు దాడులు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో ప్రశాంత వాతావరణం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జైనూర్ మండలంలో గతంలోనూ ఇరువర్గాల మధ్య ఘర్షణలు చేసుకున్నట్లు గుర్తు చేశారు. అక్కడ జరుగుతున్న ఘర్షణలపై ప్రభుత్వం స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను పరామర్శించిన డీసీసీ అధ్యక్షుడు



నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని ఆయా గ్రామాల్లో బుధవారం బాధిత కుటుంబాలను డీసీసీ అధ్యక్షులు శ్రీహర్రావు పరామర్శించారు. జామ్ గ్రామంలో కాంగ్రెస్ నాయకులు కండెల భోజన్న,బీరవెళ్లి గ్రామంలో ప్యాట లస్మన్న అనారోగ్యంతో బాధపడుతున్నారు. వారిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. బీరవెల్లి గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన మలేరియా భూమన్న, బ్యాగరి నాగన్న, పి.బోజన్న, వంజర్ గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన జక్కుల పోసవ్వ, అట్లా గంగారెడ్డి, సంగెం నర్సారెడ్డి, గుండె పోటుతో మృతి చెందిన చందాల లక్ష్మీ బాధిత కుటుంబాలను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయన వెంట మండల కన్వీనర్ బొల్లోజి నర్సయ్య, నాయకులు శ్రీనివాసరెడ్డి, రోడ్డ మారుతి, సాక్‌పెల్లి సురేందర్, అతిక్‌అహ్మద్, రమణారెడ్డి, రవీంద్రనాథ్ రెడ్డి, అట్లా పోతారెడ్డి, బలాష్టు రాజేశ్వర్, మసీరుద్దీన్, రాజేంద్ర ప్రసాద్, అక్బర్, సుభాష్ రెడ్డి ఉన్నారు.

మట్టి గణేష్ విగ్రహాల పోస్టర్ల ఆవిష్కరణ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వినాయక చవితి పండుగను పురస్కరించుకొని పర్యావరణంపై అవగహన కల్పించేందుకు మట్టి గణేష్ విగ్రహాల పోస్టర్లను కలెక్టర్ రాజర్షి షా బుధవారం తన క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణానికి అనుకూలమైన మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసుకొని పర్యావరణాన్ని కాపాడుకునే బాధ్యత అందరిపై ఉందని, రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమాలలో భాగంగా 8 అంగుళాల మట్టి గణపతిలను అందించి పర్యావరణంపై పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు టీజీపీసీబీ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అవగాహన కార్యక్రమాలలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా పర్యావరణ గణేష్ పోస్టర్ల ప్రదర్శన ఆటోట్రాలీల ద్వారా టీజీపీసీబీ చేపడుతుందని తెలిపారు. మట్టి గణపతి ద్వారా పర్యావరణ పరిరక్షణపై పాఠశాలలో, కళాశాలల్లో క్విజ్ కార్యక్రమాలు నిర్వహించడం, చేతి వృత్తిల వారికి మట్టి విగ్రహాలు తయారిపై శిక్షణ, ఆటోల వెనుక, పోస్టర్ల ప్రదర్శన, బస్టాప్‌లలో హోర్డింగ్‌లు, కళాజాత ద్వారా ప్రచార కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ లక్ష్మణ్ ప్రసాద్, అనాలిస్ట్ రంజిత్ కుమార్, సాయి ప్రసాద్, శివకృష్ణ పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ ప్రజా వేదిక

నవతెలంగాణ-బేల

మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం జాతీయ గ్రామీణ ఉపాధి హామీపై 13వ సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. ఎంపీడీవో, ఏపీడీ కుటుంబరావ్ ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా మండలంలోని 37గ్రామ పంచాయతీలో 2023-24 సంవత్సరానికి జాతీయ గ్రామీణ ఉపాధి హామీలో చేపట్టిన పనులపై సామాజిక తనిఖీలు నిర్వహించారు. పలు గ్రామాల్లో తనిఖీలు చేసిన ఎస్ఆర్పిలు తమ నివేదికలను చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఏపీడీ కుటుంబరావు మాట్లాడుతూ మండలంలో 37 గ్రామపంచాయతీలలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కింద మండలంలో రూ.3.63కోట్ల నిధులతో పనులు చేయించడం జరిగిందని పేర్కొన్నారు. ఇందులో పలు గ్రామపంచాయతీలలో చిన్నచిన్న అవకతవకలు రుజువు కావడంతో సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీడి కృష్ణారావు, ఎంపీడీవో మహేందర్ కుమార్, ఏపీవో వెంకటరమణ, డిఆర్పీలు, ఎస్ఆర్‌పిలు, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



9న కాళోజి నారాయణరావు జయంతి ఉత్సవాలు నిర్వహించాలి

నవతెలంగాణ-నిర్మల్

ప్రజాకవి, పద్మభూషణ్ కాళోజి నారాయణరావు జయంతి ఉత్సవాలను సెప్టెంబర్ 9న అధికారికంగా నిర్వహించాలని డీఈవో రవీందర్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం సెప్టెంబర్ 9న తెలంగాణ భాషా దినోత్సవంగా ప్రకటించిందని, ఈ సందర్భంగా జిల్లాలోని అన్ని పాఠశాలలు, విద్యాసంస్థలు తమ సంస్థల్లో కాళోజీ నారాయణరావు జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని తెలిపారు. కాళోజి నారాయణరావు జీవితం, సాహిత్యంపై విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు, కవి సమ్మేళనాలు నిర్వహించాలని పేర్కొన్నారు.